

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 276 ఆదివారం, నవంబర్ 08, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

కూటమి వల్ల సీఈసీ తొలగింపు సాధ్యమేనా



(న్యూఢిల్లీ, సాక్షర): సీఈసీ అంటే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్. ఇది రాజ్యాంగ బద్ధమైన పదవి. ఈపదవి నుంచి కేంద్రం కూడా.. జ్ఞానేశ్ కుమార్‌ని నేరుగా తొలగించలేదు. దీనికి రాజ్యాంగం సూచించిన విధంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే విధానం అవలంభించాలి. అంటే రాజ్యాంగ పరమైన అంశాలను పాటిస్తూ ముందుకెళ్లాలి. ఇంతకు అవేమిటంటే.. సీఈసీ ని తొలగించే రాజ్యాంగ ప్రక్రియ..! రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం...లోక్‌సభలో తొలగింపు తీర్మానం ఆమోదం పొందాలి.రాజ్యసభలోనూ తీర్మానం ఆమోదం పొందాలి.నిరూపిత దుష్ప్రవర్తన లేదా అసమర్థత వంటి రాజ్యాంగపరమైన కారణాలు ఉండాలి.ప్రతి సభలో మొత్తం సభ్యుల మెజారిటీతో పాటు హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండొంతుల మద్దతు అవసరం.సీఈసీని తొలగించాలంటే ముందు విపక్షానికి అవసరమైన సంఖ్యా బలం కావాలి. ప్రస్తుతం విపక్ష ఇండియా కూటమికి ఉన్న బలం.. తీర్మానంప్రవేశపెట్టడానికి సంతకాలకు సరిపోతాయి. కానీ.. సీఈసీ ని నిజంగా తొలగించాలంటే రెండు సభల్లోనూ ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతేకాదు.. మిగతా 3 లో

డిసెంబర్ నుంచి కాళేశ్వరం పనులు



(కరీంనగర్, సాక్షర): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిపుణుల సూచనలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల మార్గదర్శకాల మేరకే పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని తేల్చిచెప్పారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.మూడు బ్యారేజీల పునరుద్ధరణకు మొత్తం రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ నెలాఖరులోగా తుది అనుమతులు పొందాలని, డిసెంబర్‌లోగా పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. నిర్మాణంలో జరిగిన లోపాల మరమ్మతుల ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థలే భరించేలా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అదనపు పనులకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు.మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని లిఫ్ట్ చేయడం లేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని అధికారులు వివరించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసివేయాల్సి ఉంటుందని తెలిపారు. అయితే గేట్లు మూసివేయవద్దని గతంలోనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు.దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా దిగువ గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. గత మూడేళ్లలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా సగటున 18. 3 లో

డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు కళ్లెం



(న్యూయార్క్, సాక్షర): అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు కళ్లెం వేశాయి. కాంగ్రెస్‌లో సంపూర్ణ ఆధిపత్యం కోల్పోవడంతో ట్రంప్ పరిపాలనాపరంగా చేతులు, కాళ్లు కట్టేసిన స్థితికి చేరుకున్నారు. వైట్‌హౌస్ నిర్ణయాలకు కాంగ్రెస్ అడ్డంకిగా మారనుండటంతో.. తన వద్ద ఉన్న ఏకైక అస్త్రమైన ప్రెసిడెన్షియల్ వీటో ను ప్రయోగిస్తానంటూ ఆయన బెదిరింపులకు దిగుతున్నప్పటికీ, వాస్తవంలో ఆయన రాజకీయ అధికారం గణనీయంగా బలహీనపడింది. ట్రంప్ అనుసరించే దూకుడు, ఏకపక్ష నిర్ణయాల వల్ల గత కొంతకాలంగా అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితికి ఈ ఫలితాలు తాత్కాలిక బ్రేక్ వేయడంతో, ట్రంప్ పట్టు సడలిందన్న వార్తతో ప్రపంచ మార్కెట్లలో ఒక రకమైన ఊరట, సానుకూల వాతావరణం వ్యక్తమవుతోంది. పూర్తిగా 3 లో

ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు..



ఇరాన్ అణు కార్యక్రమంపై కీలక సమాచారం అందించిన వారికి 20 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 166 కోట్లు) వరకు భారీ రివార్డును అమెరికా ప్రకటించింది. శుక్రవారం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ సంచలన ప్రకటన విడుదల చేసింది. సమాచారం అందించిన వారికి అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ఆఫర్‌ను ప్రకటించారు. ఇరాన్ అణు కేంద్రాలు, వాటిలో ఉపయోగించే పరికరాలు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది వివరాలు అందించాలని కోరారు. సిగ్నల్ లేదా టోర్ ఆధారిత చానెల్ ద్వారా ఈ సమాచారాన్ని రహస్యంగా పంపవచ్చని సూచించారు. పూర్తిగా 2 లో

వైట్‌హౌస్‌లో ట్రంప్ దీపావళి..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన అధికారిక కార్యాలయం ఓవల్ ఆఫీస్‌లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ భారతీయ-అమెరికన్ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ స్వయంగా దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకకు అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య వంటి ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటు మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. పూర్తిగా 2 లో

దీపావళి ధమాకా.. దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం



(ఢిల్లీ, సాక్షర): దేశవ్యాప్తంగా దీపావళి పండుగ సీజన్ వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సీజన్‌లో సుమారు రూ.5 లక్షల కోట్ల భారీ వ్యాపారం జరుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. దేశ రాజధాని ఢిల్లీలోనే దాదాపు రూ.80,000 కోట్ల వాణిజ్యం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. ఈ పండుగ సీజన్ దేశవ్యాప్తంగా వ్యాపారులకు గొప్ప అవకాశాలను తెచ్చిపెట్టిందని అన్నారు. ముఖ్యంగా వినియోగదారుల నుంచి స్వదేశీ ఉత్పత్తులకు బలమైన డిమాండ్ కనిపిస్తోందని తెలిపారు. పూర్తిగా 3 లో

రంగంలోకి రామచంద్రరావు...



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాజకీయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. హైదరాబాద్-రంగాజిల్లా-మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు స్వయంగా రంగంలోకి దిగాలని భావించడం, దానికి అధిష్ఠానం ఆమోద ముద్ర వేయడం ఇప్పుడు కమలదళంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. త్వరలో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన అనుభవం రామచంద్రరావుకు ఉన్నప్పటికీ, రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండి మళ్లీ ఈ ఎన్నికల్లో పోటీ చేయడం అత్యంత ప్రమాదకరమైన పొలిటికల్ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీలోనైనా రాష్ట్ర అధ్యక్షుడు యావత్ రాష్ట్రంపై దృష్టి సారించి పార్టీని విజయతీరాలకు చేర్చాలి తప్ప, స్వయంగా ఒక నియోజకవర్గానికే పరిమితమై ప్రచారం చేసుకోవడం అరుదు. ఒకవేళ పట్టభద్రుల పోరులో ఫలితం తేడా వస్తే, వచ్చే మొదటి సవాలు రామచంద్రరావు నాయకత్వంపైనే. 2 లో

కోడంగల్ ఎత్తిపోతల టెండర్లపై కేటీఆర్ సంచలన ఆరోపణలు..



• ప్రాజెక్టు వ్యయం రూ.6,825 కోట్లకు ఎలా పెరిగింది?

హైదరాబాద్ : కోడంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును శనివారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఎండగట్టారు. సదరు ఎత్తిపోతల పథకానికి రేవంత్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే.. మంత్రి పొంగులేటికి చెందిన కంపెనీ అందులో పాల్గొందని విమర్శించారు. ఈ టెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపై ఉన్న నామమాత్రపు సంస్థలని తెలిపారు. 3 లో

గ్రామ పంచాయతీలకు తెలంగాణ సర్కార్ తీపి కబురు..



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామ పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సిన అవసరం లేకుండా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీల సొంత ఆదాయాన్ని నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ కొత్త విధానం అక్టోబర్ 9 నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. గతంలో గ్రామ పంచాయతీలు పన్నులు, ఇతర రుసుముల రూపంలో వసూలు చేసిన ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వచ్చేది. దీంతో గ్రామాల్లో సేకరించిన ఆదాయాన్ని తిరిగి స్థానిక అవసరాలకు వినియోగించుకోవాలంటే ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. 3 లో

మొదటి పేజీ తరువాయి కోడంగల్ ఎత్తిపోతల టెండర్లపై కేటీఆర్ సంచలన ఆరోపణలు..

చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిందని వివరించారు. వ్యయం ఇంత భారీగా పెరగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వివరించారు. ఈ ప్రాజెక్టు వ్యయం ఐదు రెట్లు పెరిగిందని సోదాహరణగా చెప్పారు. ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా ప్రజలకు అందలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ప్రభుత్వంపై అగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో పారదర్శకతకు తావు లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఓ వైపు తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులపై నిప్పులు చెరిగారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంలోని నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని ఆయనకు స్పష్టం చేశారు. క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా తెలంగాణలో జరుగుతున్న దోపిడీని వివరించడానికి సరిపోవడం లేదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్ల ప్రక్రియలోనూ తమకు అనుకూలమైన కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుబట్టారు.

రైతుల రాకపోకలకు అడ్డంకులు తొలగిస్తాం..

- కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు.



వనపర్తి పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా పట్టణ శివారులోని 11, 13వ వార్డుల పరిధిలో ఉన్న కాలువను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.నల్లచెరువు, తాళ్ల చెరువులు నిండిన సమయంలో అలుగు ద్వారా భారీగా నీరు ప్రవహిస్తుండటంతో కాలువ అవతల ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణం చేపడితే రైతుల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గాంధీ చౌక్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గతంలో పోలీస్ స్టేషన్ ఉన్న స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు.అదే సమయంలో అక్కడి దుకాణదారులకు ఇబ్బంది కలగకుండా, సమీపంలోని హనుమాన్ ఆలయ లైన్‌లో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఇక్కడ నూతన దుకాణాలను నిర్మించి వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.దుకాణాల నిర్మాణానికి సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా నూతన దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే నిర్ణయంపై దుకాణదారులు హర్షం వ్యక్తం చేశారు.తమకు దుకాణాలు నిర్మించి ఇస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి SLN రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, pcc సభ్యులు శంకర్ ప్రసాద్, జిల్లా జర్నల్ సెక్రెటరీ బ్రహ్మంచారి, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ, ఖాదర్ పాషా, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి వైట్‌హౌస్‌లో ట్రంప్ దీపావళి..

ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహూకరణ ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఓక్యూఐఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు విశాల్ గోండల్, అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' పుస్తకాన్ని బహూకరించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "ధైర్యం, భక్తి, శక్తి కోసం కోట్లాది మంది పఠించే తులసీదాస్ రచించిన హనుమాన్ చాలీసాను అధ్యక్షుడికి బహుమతిగా ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. దీపాలు వెలిగించినప్పుడు, భారత్-అమెరికా మధ్య స్నేహం వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు విజయం సాధించాలని తాను ప్రార్థించినట్లు గోండల్ తెలిపారు. శాంతి, శ్రేయస్సు, ఆరోగ్యం ప్రపంచమంతటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ధల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ రూబీ ధల్లా, న్యాక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ శర్మ, కేశవం డీసీ ప్రెసిడెంట్ విశ్వజిత్ మల్లంపాటి వంటి పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు. వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలను జరపడం 2003లో అప్పటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ప్రారంభమైంది. అయితే, 2009లో బరాక్ ఒబామా వైట్‌హౌస్‌లో స్వయంగా దీపం వెలిగించిన తొలి అధ్యక్షుడిగా నిలిచారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ట్రంప్ హయాంలో ఈ వేడుకలను ఓవల్ ఆఫీస్‌లో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మొదటి పేజీ తరువాయి గ్రామ పంచాయతీలకు తెలంగాణ సర్కార్ తీపి కబురు..

తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు ఆర్థికపరమైన స్వేచ్ఛ కలగనుంది. -అభివృద్ధి పనులకు నిధుల వినియోగంలో వెసులుబాటు: గతంలో అమల్లో ఉన్న విధానం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులకు నిధులు విడుదల చేయించుకోవడంలో పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొనేవి. ముఖ్యంగా బిల్లుల చెల్లింపులు, నిధుల మంజూరులో జాప్యం కారణంగా కొన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకుండా నిలిచిపోయేవి. ఇప్పుడు సొంత ఆదాయం నేరుగా పంచాయతీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ కానుండటంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. అత్యవసర పారిశుద్ధ్య పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర ప్రజా అవసరాలపై వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఈ విధానం దోహదపడనుంది. మొత్తంగా గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబనను పెంచడంతో పాటు స్థానిక పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారనుంది.

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక..



తమిళనాడు విద్యార్థులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుభవార్త చెప్పారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు రూ.2,000 కోట్లు మంజూరు చేశారు. 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో ఏడాది డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్ట్స్, సైన్స్, వైద్య, న్యాయ, వ్యవసాయ, పశువైద్య, మత్స్యశాస్త్ర కోర్సుల విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులు. గత విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు అందుకొని ప్రొఫెషనల్ కోర్సుల మూడు, నాలుగో ఏడాది విద్యార్థులకూ అవకాశం కల్పించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ లేదా దానికి సమానమైన సాంకేతికత ఉండనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ల్యాప్‌టాప్‌ల కొనుగోలు బాధ్యతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు)కు అప్పగించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఆన్‌లైన్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసం, ఉద్యోగ అవకాశాలకు సిద్ధమయ్యేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

శత్రుదేశాలకు నిద్ర లేకుండా చేస్తున్న ప్రళయ్...



(బెంగళూరు, సాక్షర): భారత్ మరో క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే 'ప్రళయ్' క్షిపణిని డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో క్షిపణి ప్రయోగం విజయవంతంగా లక్ష్యాన్ని చేదించినట్లు రక్షణశాఖ ప్రకటించింది.ఈ ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వినియోగదారుల మూల్యాంకన పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఇది విజయవంతంగా పూర్తి చేసింది. వివిధ రేంజ్ సాధనాల ద్వారా సేకరించిన డేటా ఈ విషయాన్ని ధ్రువీకరించింది" అని ఆయన తెలిపారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ విజయం మరో ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీవో గత నెలలో కూడా మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్ఏపీఎస్) విమాన ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగంలో భాగంగా హెచ్ఏపీఎస్ 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, సుదీర్ఘ సమయం పాటు స్ట్రాటోస్ఫియర్‌లో ప్రయాణించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది.రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక విమానం సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా నిలకడగా ప్రయాణించింది. నిరంతర నిఘా, కమ్యూనికేషన్లు, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలకు స్ట్రాటోస్ఫియర్ ఎంతో అనుకూలమైన ప్రాంతం కాగా, ఆ ఎత్తులో పనిచేసే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ నిరూపించింది. ప్రయోగ సమయంలో ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్ నుంచి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు రియల్ టైమ్ వీడియో, వాహన పనితీరు డేటా నిరంతరం ప్రసారమైంది.ఈ వ్యవస్థలో ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, జీపీఎస్ రిసీవర్, ఆన్‌బోర్డ్ కెమెరాలు, ఎత్తును నియంత్రించే యంత్రాంగాలు వంటి అనేక పరికరాలను అమర్చారు. ఈ ఉప వ్యవస్థలన్నీ మిషన్ అంతటా సక్రమంగా పనిచేశాయని అధికారులు తెలిపారు. భారత వైమానిక దళం, సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తినెస్ అండ్ సర్టిఫికేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి పలు ఏజెన్సీల సమన్వయంతో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.

ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు వరంగల్ సీపీ ప్రోత్సాహం



- హ్యాండ్‌మేడ్ వస్తువుల కొనుగోలు

(హనుమకొండ, సాక్షర): బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు, కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు. విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఎ ఆర్ అడిషనల్ డీసీపీ సురేష్, ఆర్ఐ (అడ్మిన్) సర్వన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్ , మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోటకొండూర్‌లో రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



(మోటకొండూర్, సాక్షర): మోటకొండూర్ మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మోటకొండూర్ గ్రామానికి చెందిన నల్ల నరేశ్, నారి సురేశ్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. మండలంలో అక్రమ ఇసుక రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తూ ప్రజా వనరులను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రోడ్లపై మృత్యురాశులు...

(నిజామాబాద్, సాక్షర): తెలంగాణలో రైతులు పంటలు రోడ్లపై వేస్తున్నందున ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. రైతులు తమ పంటలను కాపాడటానికి చుట్టూ కంకరలు వేస్తున్నారు.అయితే, ఈ ఆచారం రోడ్లను ప్రమాదకరంగా మార్చుతోంది. పంటలను ఎండబెట్టడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం రైతుల సమస్యగా మారింది. ఈ ప్రమాదాల వల్ల సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.అధికారుల నిర్లక్ష్యం పై ఆందోళన పెరుగుతోంది. వరి మరియు మక్కా పంటల కోత మొదలైంది. ప్రధాన మరియు గ్రామీణ రోడ్లు పంటలతో అడ్డుకట్టగా మారుతున్నాయి.రైతులు తమ పంటలను కాపాడటానికి పెద్ద కంకరలను ఉపయోగిస్తున్నారు. అయితే, రాత్రి లేదా పొగమంచులో ఈ కంకరలు కనబడడం లేదు, ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. గత సంవత్సరం వరంగల్ జిల్లాలో 38 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి.ఈ ప్రమాదాల్లో చాలా మంది స్పాట్‌లోనే మరణించారు. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు మరియు అంగవైకల్యం చెందారు. వరంగల్-ఇయనవోలు రోడ్డులో వెంకట రెడ్డి మరియు చిన్న యాకుబ్ అనే ఇద్దరు మిత్రులు ఒక ప్రమాదంలో మరణించారు.ఈ సంఘటన స్థానిక ప్రజలను వెంటాడుతోంది. రైతులు ప్రభుత్వ మద్దతు లేకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎండబెట్టడానికి సరైన సౌకర్యాలు లేవు.రైతులు తమ పంటలను త్వరగా ఎండబెట్టడానికి రోడ్లనే ఒకే ఒక సౌకర్యంగా భావిస్తున్నారు. ప్రభుత్వాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. పంటలు తేమ కారణంగా ఆలస్యం కాకుండా కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.ప్రమాదాలు జరిగిన తర్వాత పోలీసులు మరియు అధికారులు రోడ్లపై పంటలు ఉంచడం పై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. 'అలైవ్ - అరివ్' వంటి అవగాహన సెమినార్లు నిర్వహించబడుతున్నాయి. రైతులు హెచ్చరికలు మరియు నియమాలను జారీ చేయడం మాత్రమే ఈ సమస్యను పరిష్కరించదు అని నమ్ముతున్నారు., ఉపాధి హామీ పథకాలు లేదా ఇతర నిధుల ద్వారా. రైతులు తమ పంటలను త్వరగా ఎండబెట్టడానికి సబ్సిడీ పరికరాలు మరియు కవర్లు అవసరం. పంటల కోత సీజన్‌కు ముందు కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి.పంటలు ఎండిన తర్వాత మిల్లులకు వెంటనే తరలించాలి. అధికారులు రోడ్ల వద్ద స్పష్టమైన హెచ్చరిక సంకేతాలు మరియు ప్రతిబింబిత స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. రైతుల కష్టాలు వృథా కాకూడదు మరియు ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడకూడదు.ప్రాణాలను కాపాడటానికి అధికారుల నుండి వ్యావహారిక చర్యలు తీసుకోవాల్సిన అత్యవసర అవసరం ఉంది. ఈ వ్యాసం తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేస్తుంది. పంటలను ఎండబెట్టడానికి సరైన మౌలిక సదుపాయాల లోపం ఒక ముఖ్యమైన సమస్యగా ఉంది.ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులు ప్రభుత్వ నుండి మెరుగైన మద్దతు మరియు సౌకర్యాలను కోరుతున్నారు. ఈ వ్యాసం రోడ్డు ప్రమాదాల కారణంగా రైతుల భద్రత మరియు జీవనోపాధి పై ఉన్న ఆందోళనలను చర్చిస్తుంది.వ్యవసాయ పద్ధతుల సంబంధిత రోడ్డు భద్రతపై ఈ వ్యాసం దృష్టి సారిస్తుంది. సంఘటనలపై సమాజంపై ఉన్న భావోద్వేగ ప్రభావాన్ని కూడా ఈ వ్యాసం ప్రస్తావిస్తుంది. రైతులు భవిష్యత్తు ప్రమాదాలను నివారించడానికి పరిష్కారాలను కోరుతున్నారు.రైతుల అవసరాలను పరిష్కరించడం ఎంత ముఖ్యమో ఈ వ్యాసం పునరుద్ఘాటిస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి సహకార దృక్పథం అవసరమని ఈ వ్యాసం సూచిస్తుంది. అధికారుల నుండి తక్షణ చర్య కోసం ఈ వ్యాసం చివర్లో విజ్ఞప్తి ఉంది.

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం...

- కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ
- స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ
- నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు
- సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు...
- బంగారం, నగదు స్వాధీనం



(హైదరాబాద్):స్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

డిసెంబర్ నుంచి కాళేశ్వరం పనులు

13 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సగటు 9.57 టీఎంసీలుగా ఉండేదని, ప్రస్తుతం 89 శాతం అధికంగా నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ప్రాజెక్టు ద్వారా 8.10 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మొత్తం 24.81 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించి ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు, తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు.ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తేవి కావని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రాణహిత జలాలను తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల కారణంగానే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం వ్యాఖ్యానించారు.మొత్తంగా కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ, భద్రత, గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. డిసెంబర్‌లో పనులు ప్రారంభించేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

- సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రారంభించారు



ఈ సందర్భంగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, అకాల వర్షాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు, మార్కెట్ యార్డుల దుస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ. రాష్ట్రంలో కరువు పరిస్థితుల వల్ల ఒకవైపు దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. మరొకవైపు పండిన కాస్త పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో, ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాల వల్ల కళ్లాలలో, ఐకేపీ సెంటర్లలో, పీఏసీఎస్ సెంటర్లలో, మార్కెట్ యార్డులలో పోసిన వడ్లు తడిసిపోయి, వరదకు కొట్టుకుపోతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ కొనుగోలు కేంద్రానికి కూడా ప్యాడీ క్లీనర్లు గానీ, టార్పాలిన్ కవర్లు గానీ, మాయిశ్చర్ మీటర్లు గానీ చేరలేదు. వడ్లు కొన్న తర్వాత తరలించడానికి అవసరమైన లారీల ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఇంతవరకు ఫైనల్ చేయలేదు; ఏ గ్రామం వడ్లు ఏ మిల్లుకు వెళ్లాలనే 'మిల్ అలాట్‌మెంట్' కూడా ఇప్పటికీ జరగలేదు. కరువు పరిస్థితుల్లో సన్న వడ్లను ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారు, మరి దొడ్డు వడ్లు పండించిన రైతుల పరిస్థితి ఏమిటి? సివిల్ సప్లైస్ మంత్రి, మార్కెటింగ్ శాఖ మంత్రి అసలు ఏం చేస్తున్నారు? రైతులంటే కనీస పట్టింపు లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టుగా రైతుల పరిస్థితి తయారైంది. రైతు రెండు ఎకరాల్లో నాటు వేస్తే కరువు దెబ్బకు ఎకరం ఎండిపోయింది, మిగిలిన ఎకరంలో పండిన పంటను కూడా ప్రభుత్వం సకాలంలో కొనకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోయి రైతులు ఆగమవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే యుద్ధప్రాతిపదికన అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు, మిల్ అలాట్‌మెంట్ వెంటనే పూర్తి చేయాలి. రెవెన్యూ, సివిల్ సప్లైస్, డీఆర్డీఏ, కో ఆపరేటివ్ అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి వెళ్లి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జనసేనాని వ్యూహాత్మక మౌనమేనా

(గుంటూరు, సాక్షర): మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించారు అయినా సరే జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం స్పందించలేదు. ఫలితాలపై ఆయన మౌనంగానే ఉన్నారు. అందుకు గల కారణాలపై పార్టీలోనూ, రాజకీయంగా చర్చజరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ సాధించిన విజయంపై పవన్ కల్యాణ్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈవీఎం, బ్యాలెట్ ఏదైనా విజయం కూటమిదేనని ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిపక్షాలు ఈవీఎంలపై విమర్శలు చేశాయని, అయితే ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించి ప్రతిపక్షాల విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ విజయం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై పట్టణ ఓటర్లు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. 100శాతం స్ట్రయిక్ రేట్ పై హర్షం వ్యక్తం చేసినా... జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ రెండు మేయర్ స్థానాలు, పదిహేను మున్సిపల్ చైర్మన్, 3 నగర పంచాయతీ స్థానాలు కలిపి మొత్తం 20 చోట్ల విజయం సాధించి 100 శాతం స్ట్రయిక్ రేట్ రిపీట్ చేయడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేస్తూ, పట్టణ ఓటర్ల ఆదరణ ఎంతో అమూల్యమైనదని కొనియాడారు.కూటమి అభ్యర్థుల గెలుపునకు రాత్రింబవళ్లు శ్రమించిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మరియు తమపై నమ్మకం ఉంచిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే ఒకింత ఆయనకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు తలనొప్పిగా మారాయని చెప్పాలి. సొంత పార్టీ క్యాడర్, జనసైనికుల నుంచి కొంత అసంతృప్తి ఎదురయింది. అనేక ప్రాంతాల్లో రెబెల్స్ పోటీ చేయడం తోపాటు కూటమిలోని మిత్ర పక్ష పార్టీలే అభ్యర్థులుగా బరిలోకి దిగడం జనసేన ఖరారయిన అభ్యర్థులు గెలిచినా టెన్షన్ పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల తమకు బలమున్న అభ్యర్థులను కూడా ఎంపిక చేయకపోవడాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి కొందరు తీసుకెళుతున్నారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే కూటమి అభ్యర్థులు కాకుండా, రెబెల్స్ గెలవడాన్ని కూడా కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తన సొంత నియోజకవర్గంలోనూ అభ్యర్థుల ఎంపిక సరైన తీరిలో జరగలేదన్న అసహనంతో పవన్ కల్యాణ్ ఉన్నారని తెలిసింది. అలాగే ఆదోని మున్సిపల్ కార్పొరేషన్ విషయంలో బలమున్న నేతను ఎంపిక చేయకపోగా, అది టీడీపీకి వదిలేయడం, జనసేన రెబల్ అభ్యర్థి గెలవడాన్ని కూడా కొందరు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. పవన్ కల్యాణ్ ను కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, బలమైన , గెలిచే స్థానాలు కాకుండా, అభ్యర్థుల ఎంపికలోనూ వారి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ గెలుపుపై మాట్లాడినా అభ్యర్థుల ఎంపిక, జనసేన రెబెల్స్ గెలవడం వంటి అంశాలను సీరియస్ గా తీసుకున్నారని తెలిసింది.=

మొదటి పేజీ తరువాయి

దీపావళి ధమాకా.. దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్ల వ్యాపారం

గత నెలలో ర్యాలీలు, నిరసనల కారణంగా వ్యాపార నష్టాలను ఎదుర్కొన్న ఢిల్లీ వ్యాపారులు, ఈ దీపావళి అమ్మకాలతో ఆ నష్టాలను పూడ్చుకుని లాభాల బాట పడతామని ఆశిస్తున్నారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా ఉన్నాయని చెప్పడానికి ఆటోమొబైల్ అమ్మకాలే నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం.. రిటైల్ ఆటోమొబైల్ అమ్మకాలు 55 శాతం పెరిగాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలు 70 శాతం, ద్విచక్ర వాహనాలు 52 శాతం, త్రీ-వీలర్లు 110 శాతం వృద్ధిని నమోదు చేశాయని, ఇది బలమైన వినియోగదారుల డిమాండ్‌కు సంకేతమని అన్నారు. ఈ ఏడాది పండుగ సీజన్‌లో స్వదేశీ వస్తువులకే ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గోయల్ తెలిపారు. మట్టి ప్రమిదలు, దేవుళ్ల విగ్రహాలు, హస్తకళా ఉత్పత్తులు, గోడ అలంకరణ వస్తువులు, శుభ్-లాభ్, ఓం వంటి సాంప్రదాయ చిహ్నాలకు మంచి డిమాండ్ కనిపిస్తోందన్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలు కూడా భారతీయ ఉత్పత్తులకు మరింత గుర్తింపునిచ్చి, స్థానికంగా తయారైన వస్తువులకు డిమాండ్‌ను బలోపేతం చేశాయని సీటీఐ తన ప్రకటనలో పేర్కొంది. వీటితో పాటు ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫ్యాషన్ అపెరల్, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, ఫర్నిచర్ వంటి రంగాల్లో కూడా భారీ వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా సుమారు 5 కోట్ల బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారని, ఇది కూడా అమ్మకాలను పెంచుతోందని తెలిపారు. ఢిల్లీలోని చాందినీ చౌక్, సదర్ బజార్, కమలా నగర్, రాజౌరీ గార్డెన్, లజపత్ నగర్ వంటి ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మొబైల్ ఫోన్లు, గిఫ్టులు, డ్రై ఫ్రూట్స్, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని, ఇది రాజధానిలో పుంజుకున్న వ్యాపార కార్యకలాపాలకు సూచిక అని గోయల్ పేర్కొన్నారు.

మహబూబాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే మా లక్ష్యం-ఎస్పీ శబరీష్

(మహబూబాబాద్, సాక్షర): డ్రగ్స్ నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని మహబూబాబాద్ ఎస్పీ శబరీష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగే మారాచడమే తమ లక్ష్యమన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత తమ బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలకు బలి చేయవద్దని పిలుపునిచ్చారు. ఎవరైనా గంజాయి తాగే వ్యక్తులు కానీ, గంజాయి అమ్మే వ్యక్తుల గురించి సమాచారం ఇస్తే రివార్డ్ అందజేస్తామన్నారు.

'మురుసు తుఫాన్ బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి'



(బూర్గంపహాడ్, సాక్షర): బూర్గంపహాడ్ మండలంలో మురుసు తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ మండల అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ... తుఫాన్ కారణంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడం లక్ష్మినారాయణరెడ్డి, రెడ్డిపాలెం ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సిరిపురం ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు కామిరెడ్డి పద్మ, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, మూల బాలిరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, బత్తుల రామకొండారెడ్డి, బానోత్ రామదాసు, బాదం అచ్చిరెడ్డి, సాదిక్‌పాషా, సౌకత్‌అలీ, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, ధనుగురి నాగేశ్వరరావు, శనగ అప్పారావు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం:మంత్రి శ్రీధర్‌బాబు



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో ఆర్థాఫిన్‌టెక్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతమైన మానవ వనరుల తయారీకి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఉద్ఘాటించారు. బ్యాంకింగ్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్లలో ఆర్థాఫిన్‌టెక్ సేవలు అందిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు..

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల సెంట్రిఫ్యూజ్‌ల వంటి కీలక పరికరాల ఉత్పత్తి, నిల్వలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. మరోవైపు, ఈ ప్రకటనకు ముందు ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మనం ఇరాన్‌పై దాడి చేయకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ ఉండేది కాదు. వారికి అణ్వాయుధాలు చిక్కి ఉంటే తప్పకుండా వాడేవారు" అని ఆయన అన్నారు. గత ఎనిమిది నెలల ఘర్షణతో ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇప్పుడు ఒప్పందం కోసం ఆరాటపడుతోందని ట్రంప్ పేర్కొన్నారు. మధ్య ఇరాన్‌లోని 'పికాక్స్ మౌంటెన్' వంటి ఒకటి రెండు ప్రాంతాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ ఆరోపణలను ఇరాన్ అధికారులు ఖండించారు. 'పికాక్స్ మౌంటెన్'కు అణు కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజేష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయడం గమనార్హం.

మెమరీ లాస్‌తో ఇన్‌కమ్ ట్యాక్స్ ఎగవేత...

- రూ.200 కోట్ల భూమి కేటాయింపుపై మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు



(హైదరాబాద్, సాక్షర): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి మెమరీ లాస్ ఉందని, ఈ కారణంగానే ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించలేకపోయానని ట్రిబ్యునల్ ముందు చెప్పినట్లు బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. 2025 నవంబర్ 26న వెలువడిన ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల్లో డిసోసియేటివ్ అమ్నీషియా (మెమరీ లాస్), హైబీపీ, షుగర్, తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నట్లు అసెస్సీ తరఫు న్యాయవాది వాదించిన అంశాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో నిరంతరం చికిత్స పొందుతున్నట్లు, అక్కడి వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు కొండల్ రెడ్డి తరఫు న్యాయవాది ట్రిబ్యునల్‌కు వివరించారు. 2023లో లోన్ చెల్లించలేదంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కొండల్ రెడ్డి ఇంటికి నోటీసులు ఇచ్చిందని క్రిశాంక్ ఆరోపించారు. మెమరీ లాస్‌తో బాధపడుతున్నట్లు చెప్పిన వ్యక్తికి టెసెరాక్ట్ సంస్థ పేరిట రూ.200 కోట్ల విలువైన భూమిని ఎలా కేటాయించారు అని అయన ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి రంగంలోకి రామచంద్రరావు...

గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు ఎక్కువగా ఉండే ఈ నియోజకవర్గంలో ఓటమి ఎదురైతే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సిన నైతిక బాధ్యత ఏర్పడుతుంది. ఈ విషయం తెలిసి కూడా ఆయన పోటీకి దిగుతున్నారా లేదా హైకమాండ్ ఆయనను ఈ రిస్కులోకి నెట్టిందా అనే సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పాలన, రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలపై దాడి చేయాల్సిన కీలక సమయంలో, రాష్ట్ర అధ్యక్షుడు ఒకే నియోజకవర్గంలో డివిజన్ల వారీగా తిరగడం బీజేపీ ప్రచార వేగానికి ఆటంకం కలిగిస్తుందనే ఆందోళన ఉంది. అయితే, రామచంద్రరావు వర్గం మాత్రం దీనిని విశ్వాస ప్రకటన గా చూస్తోంది. పట్టభద్రుల్లో బీజేపీకి ఉన్న తిరుగులేని ఇమేజ్‌ను, సీనియర్ న్యాయవాదిగా తనకున్న గుర్తింపును నమ్ముకుని, ఓటమి భయాన్ని పక్కనపెట్టి ఫ్రంట్ ఫుట్‌లో పోరాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.మరోవైపు, ఢిల్లీ వర్గాల్లోనూ, తెలంగాణ బీజేపీ వర్గాల్లోనూ ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. ఈ ఎన్నికల వేదికగా తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పునకు పునాది పడుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుకూల ఫలితం రాకపోతే, ఆ సాకుతో రామచంద్రరావు స్థానంలో మళ్లీ మాస్ లీడర్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించేలా హైకమాండ్ పక్కా వ్యూహంతో ఉందనే ప్రచారం ఊపందుకుంది.గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలంగాణ బీజేపీలో కనబడిన అగ్రెసివ్ మార్క్, క్షేత్రస్థాయి శ్రేణుల్లో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం కాస్త మందగించిందనే అభిప్రాయం కేడర్‌లో ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే మళ్లీ సంజయ్ వంటి దూకుడున్న నాయకుడే సరైన ఛాయిస్ అని భావిస్తున్న హైకమాండ్, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల ఆధారంగా తమ అసలు పొలిటికల్ గేమ్‌ను అమలు చేయవచ్చని భావిస్తున్నారు.రామచంద్రరావుకు ఈ ఎమ్మెల్సీ పోటీ ఒక రకంగా కత్తిమీద సాము లాంటిది. గెలిస్తే తన అధ్యక్ష పదవిని మరింత పటిష్టం చేసుకోవడమే కాకుండా పార్టీపై పట్టు సాధించవచ్చు, కానీ ఏమాత్రం తేడా వచ్చినా పదవిని కోల్పోవడంతో పాటు బండి సంజయ్ రీ-ఎంట్రీకి దారులు సుగమం చేసినవారవుతారు. మరి ఈ రిస్క్ పొలిటికల్ గేమ్‌లో రామచంద్రరావు గట్టెక్కుతారో లేక బీజేపీ హైకమాండ్ రాసిన స్క్రిప్ట్‌కే పరిమితమవుతారో తేలేందుకు కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

17 ఏళ్ల నిరీక్షణకు తెర..

- కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు
- కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
- 101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం
- కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట
- 14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
- కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు



కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యుగంధర్ రెడ్డి ని పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



(వనపర్తి, సాక్షర): పెద్ద మునగల్ చెడు గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి కొత్తకోటకు బైక్ పై వెళుతుండగా వెల్టూరు స్టేజ్ దగ్గర గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యుగంధర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలియగానే మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంటనే స్పందించి బాధితుడిని వనపర్తి హైందవ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం, అనంతరం హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్ కు స్వయంగా దగ్గరుండి మాజీ మంత్రి పంపించారు. ఈ కార్యక్రమంలో, నాయకులు రాజ ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ జమీల్, ఫజల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ క్యాంటీన్ మద్యం అక్రమ విక్రయాలు..

- అల్వాల్‌లో రెండు చోట్ల దాడులు, 163 బాటిళ్లు స్వాధీనం



ఆర్మీ క్యాంటీన్ కోటా ద్వారా సబ్సిడీ ధరలకు మద్యం కొనుగోలు చేసి, బయట వ్యక్తులకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అల్వాల్ పరిధిలో రెండు వేర్వేరు ఇళ్లపై దాడులు చేసి మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.11 లక్షలుగా అంచనా వేశారు. లోతుకుంట సరస్వతి నగర్‌లో మన్యం నాగప్రసన్న, ఆమె భర్త రామ్ ఆంజనేయులు ఇంటిపై మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం దాడి చేసింది. ఈ దాడిలో 96 బాటిళ్లు పట్టుబడ్డాయి. భర్త క్యాంటీన్ ద్వారా మద్యం తెస్తుండగా, భార్య ఇంటి నుంచే విక్రయాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రెండో ఘటనలో న్యూ బోయిన్‌పల్లిలోని సౌజన్య కాలనీలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్-బి దాడి చేసి ముసిమి లెంక (39) వద్ద 67 బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై నాగప్రసన్న, లెంకలను అరెస్ట్ చేసి అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు

అవుసులపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు..

నేరాల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 69 ద్విచక్ర వాహనాలు, రెండు బొలెరోలు, నాలుగు ఆటోలను కలిపి మొత్తం 75 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ జూబి సహాయంతో ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రలను సేకరించి పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, స్ట్రాప్ బిగించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికతో ఆమె అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నా పోక్సో చట్టం ప్రకారం నేరమేనని, నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, వారి భద్రత, నేరాల నియంత్రణ కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండేందుకు వీఓపీ ఏఎస్ఐ విఠల్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రిమ్స్‌లో వెంటిలేటర్ల చోరీ..



- దొంగల ముఠా అరెస్ట్

(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో నాలుగు వెంటిలేటర్లను చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సజ్జన్, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్లమంటూ రిమ్స్‌లోకి ప్రవేశించి వెంటిలేటర్లను అపహరించినట్లు తెలిపారు. గత నెల 30న రిమ్స్ ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్ఐసీయూ, చెస్ట్ వార్డుల నుంచి ఒక్కో వెంటిలేటర్, టీబీ వార్డు నుంచి మరో రెండు వెంటిలేటర్లు చోరీకి గురయ్యాయి. మొత్తం నాలుగు పరికరాలు మాయమైనట్లు ఆస్పత్రి అధికారులు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులు వెంటిలేటర్లను సంచుల్లో పెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో రిమ్స్ డైరెక్టర్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే నిందితులను పట్టుకున్నారు. హైదరాబాద్ వ్యాపారికి విక్రయం: వెంటిలేటర్లను చోరీ చేసిన సజ్జన్, అభిజిత్ వాటిని హైదరాబాద్‌కు చెందిన కొండారెడ్డి అనే వైద్య పరికరాల వ్యాపారికి విక్రయించినట్లు ఎస్పీ వెల్లడించారు. చోరీ చేసిన పరికరాలను కొండారెడ్డి చంద్రపూర్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా ఆదిలాబాద్ పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు వెంటిలేటర్లతో పాటు కారు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లకు దివాళీ వెలుగులు

(ఖమ్మం, సాక్షర): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై క్షేత్రస్థాయిలో ఉన్న ప్రచార లోపాన్ని అధిగమించేందుకు రేవంత్ రెడ్డి మంత్రివర్గం సరికొత్త రాజకీయ వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పేరుతో ఒక వినూత్న ప్రజా సంబంధాల కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ అధికారికంగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఏకంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, పండుగ వేళ ఆ ఇళ్లన్నింటిలో ప్రభుత్వం తరపున వేడుకలు జరపాలని నిర్ణయించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించాలన్నది సర్కారు ప్రధాన ఉద్దేశం.వాస్తవానికి రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాల్లో తీవ్రమైన పబ్లిసిటీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలు, ప్రజాక్షేత్రంలో ఉన్న భావనలు ప్రభుత్వాన్ని కొంత డిఫెన్స్‌లోకి నెట్టాయి. అసలు రాష్ట్రంలో ఒక్క పేదవాడికైనా ఇల్లు మంజూరైందా, లబ్ధిదారుల ఖాతాల్లోకి నయాపైస అయినా జమ అయిందా అన్న సందేహాలు సామాన్య ప్రజల్లో కూడా బలంగా నాటుకుపోయాయి. క్షేత్రస్థాయిలో వేలాది మంది నిర్మాణాలు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్న విపక్షాల ప్రచారం హోరెత్తుతుండగా.. ప్రభుత్వం తమ శాఖాపరమైన ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో దారుణంగా విఫలమైందన్న విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే వినిపించాయి.ఎవరికీ తెలియకుండానే నిశ్శబ్దంగా దాదాపు 2.25 లక్షల ఇళ్లను పూర్తి స్థాయి నిర్మాణానికి తీసుకువచ్చామని ప్రభుత్వం ఇప్పుడు అధికారిక గణాంకాలతో ముందుకొచ్చింది. కానీ ఎంత పని చేసినా దాన్ని మార్కెటింగ్ చేసుకోలేకపోతే రాజకీయంగా శూన్యమే మిగులుతుందన్న చేదు నిజాన్ని ఆలస్యంగానైనా గ్రహించిన క్యాబినెట్.. ఈ దీపావళి పండుగను తమ విజయాలను ప్రదర్శించే వేదికగా మార్చుకోవాలని నిర్ణయించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట తప్పిందని చేస్తున్న ప్రచారానికి చెక్ పెట్టాలంటే.. పూర్తయిన రెండున్నర లక్షల ఇళ్ల ముంగిట స్వయంగా దీపాలు వెలిగించి చూపించడమే సరైన సమాధానమని పాలక వర్గం భావిస్తోంది. పండుగ సంబరాల ముసుగులో విపక్షాల నోళ్లు మూయించేందుకు ఇదొక వ్యూహాత్మక అస్త్రంగా మారింది. ప్రచార నిర్వహణలో విఫలమైన మాట వాస్తవమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధించిన ఈ భారీ ఫలితాన్ని దీపావళి వేడుకల ద్వారా ప్రజల దృష్టికి తేవాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కలిసివచ్చే అవకాశాలున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా లబ్ధిదారుల గుమ్మంలో అడుగుపెట్టి వారితో మమేకమైతే.. ఆ దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో పథకం ఉనికిని, ప్రభుత్వ పనితీరును బలంగా చాటిచెబుతాయి. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, లబ్ధిదారుల ముఖాల్లోని సంతోషాన్ని ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడం ద్వారా ఇప్పటివరకు ఉన్న అపోహలను తుడిచిపెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ అడుగు క్షేత్రస్థాయిలో ఏ మేరకు మైలేజ్ తెచ్చిపెడుతుందో వేచి చూడాలి

ప్రసూతి ఆసుపత్రిలో బాలింత మృతి..

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

(హనుమకొండ, సాక్షర): హనుమకొండ ప్రసూతి ఆసుపత్రిలో బాలింత మృతి చెందడం కలకలం రేపింది. స్టేషన్ ఘన్‌పూర్ మండలం పాంనూరు గ్రామానికి చెందిన పొన్న రమ్య ప్రసవించి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తరువాత రెండు గంటలకే రమ్మ మృతి చెందింది. ఉదయం 4 గంటల సమయంలో అధిక రక్తస్రావం కావడంతో ప్రాణాలు కోల్పోయింది. రక్తస్రావం సమయంలో డ్యూటీలో జూనియర్ డాక్టర్ మాత్రమే ఉన్నారని, సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే రమ్య మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. న్యాయం చేయాలని అందోళనకు దిగారు.

మొదటి పేజీ తరువాయి కూటమి వల్ల సీఈసీ తొలగింపు సాధ్యమేనా

విచారణ కమిటీ ఆరోపణలను నిర్ధారించాలి.లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ అవసరమైన మెజారిటీ రావాలి.ఆమోదం ఒకే పార్లమెంటు సమావేశంలో రావాలి.అందువల్ల ప్రతిపక్షానికి ఉన్న ఎంపీల సంఖ్య మాత్రమే కాకుండా, అధికార పక్షం లేదా ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడా కీలకం.ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని 2026 మార్చిలో ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇచ్చారు.లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేశారు.రాజ్యసభలో 63 మంది ఎంపీలు సంతకాలు చేశారు.అయితే ఏప్రిల్ 6న లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ ఆ నోటీసులను స్వీకరించలేదు. -ఇండియా కూటమి ముందున్న అవకాశాలు.. ఎన్నికల సంఘం నిర్ణయాలపై పార్లమెంటులో చర్చకు ఒత్తిడి తీసుకు వచ్చే అవకాశం ఉంది.ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచడం..ఎన్నికల సంఘం పనితీరుపై న్యాయపరమైన పరిశీలన కోరడం, ఇదే సమయంలో ఇతర పార్టీల మద్దతు కోరడం చేయవచ్చు. చట్టపరమైన అడ్డంకులు..! లోక్‌సభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ సాధించాలి. రాజ్యసభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ అదనపు మద్దతు అవసరం..ఆ తరువాత రాష్ట్రపతి తొలగింపు ఉత్తర్వు జారీ చేస్తారు.కేవలం రాజకీయ విభేదాలతో సీఈసీని తొలగించడం సాధ్యం కాదు.ఎన్నికల సంఘం నిర్ణయాలు సంస్థాగత ప్రక్రియలో భాగమని ఎన్నికల సంఘం పేర్కొంది.గత నోటీసుల్లో ఆరోపణలకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు లేవని స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అభిప్రాయపడ్డారు.ఇండియా కూటమి సీఈసీ ని తొలగించాలంటే మూడు అడ్డంకులు దాటాలి.తొలగింపు నోటీసు ఆమోదం పొందాలి.ఆరోపణలు విచారణలో నిరూపించబడాలి.పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ రావాలి.సీఈసీ పై ఆరోపణలు నిరూపితమైతే, అధికార పక్షానికి పార్లమెంటులో మెజారిటీ ఉన్నప్పటికీ రాజ్యాంగపరమైన తొలగింపు ప్రక్రియను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

తెలంగాణలో మరో కొత్త జిల్లా

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి రాష్ట్రంలో 10 జిల్లాలు ఉండగా.. కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల సంఖ్యను 33కి పెంచింది. త్వరలోనే మరో కొత్త జిల్లా ఏర్పాటు కానుందనే ప్రచారం మొదలైంది. హైదరాబాద్ శివార్లలో ఫ్యూచర్ సిటీ పేరిట కొత్త నగరాన్ని నిర్మిస్తోన్న రేవంత్ రెడ్డి సర్కారు.. ఆ ప్రాంతం మొత్తాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి పేరును జిల్లాకు పెట్టే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. రేవంత్ రెడ్డి భార్యకు జైపాల్ రెడ్డి పెదనాన్న అవుతారనే సంగతి తెలిసిందే.హైదరాబాద్ శివార్లలోని హయత్ నగర్ ప్రాంతంతోపాటు ఇబ్రహీంపట్నం, షాద్ నగర్, మహేశ్వరం, కల్వకుర్తి, దేవరకొండ నియోజకవర్గాలు ఈ ప్రతిపాదిత జిల్లాలో ఉండొచ్చని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. జైపాల్ రెడ్డి స్వగ్రామమైన మాడ్గుల కల్వకుర్తి నియోజకవర్గంలోనే ఉంది. దీంతో ఈ జిల్లాకు ఆయన పేరు పెడితే బాగుందని భావిస్తున్నట్లు సమాచారం. అయితే కొత్త జిల్లా ఏర్పాటు విషయమై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.ఫ్యూచర్ సిటీ డెవల్‌మెంట్ అథారిటీ పరిధిలో 56 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మహేశ్వరం మండలంలోని 28 గ్రామాలు, కందుకూరు మండలంలోని 9 గ్రామాలను దీని పరిధిలోకి చేర్చాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది.జనాభా లెక్కల సేకరణ వల్ల 2027 మార్చి వరకు పరిపాలన సరిహద్దులు మార్చడం కుదరదు. అందుకే జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లను మార్చాలని ఇప్పటికే వచ్చిన వినతులను కూడా ఈ గడువు ముగిసిన తర్వాతే జ్యూడిషియల్ కమిషన్‌కు పంపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇంతకు ముందే వెల్లడించారు. కాబట్టి 2027 మార్చి తర్వాతే కొత్త జిల్లా ఏర్పాటు విషయమై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ కొత్త జిల్లా ఏర్పాటైనప్పటికీ.. జిల్లాల సంఖ్య పెరిగే అవకాశం లేదు.కేసీఆర్ సర్కారు కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో శాస్త్రీయ విధానాన్ని అవలంబించలేదని.. స్థానిక డిమాండ్లకు అనుగుణంగా జిల్లాలను ప్రకటించిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రేవంత్ సర్కారు సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ములుగు లాంటి చిన్న చిన్న జిల్లాల్లో కొన్నింటిని పొరుగు జిల్లాల్లో కలిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.హైదరాబాద్ నగరంలో గతంలో 3 పోలీస్ కమిషనరేట్లు ఉండగా.. రేవంత్ సర్కారు వాటిని నాలుగు కమిషనరేట్లుగా మార్చింది. ఈ నాలుగు కమిషనరేట్లను నాలుగు జిల్లాలుగా గుర్తించే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉందని ప్రచారం జరుగుతోంది.

గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాలి



(ఉట్నూర్, సాక్షర): గిరిజనుల సాంప్రదాయ కళలు, ఆచారాలు, పండుగలు మన వారసత్వ సంపదకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు పేర్కొన్నారు. ఉట్నూర్ మండలం మత్తడి గూడ గ్రామంలో నిర్వహించిన గుస్సాడీ దండారి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.శనివారం మధ్యాహ్నం నిర్వహించిన గుస్సాడీ దండారి ఉత్సవాల్లో ప్రాజెక్టు అధికారి మంద మకరందు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ గిరిజన ప్రజలు ప్రాజెక్టు అధికారికి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రాజెక్టు అధికారి నెమలి పింఛాన్ని ధరించి, గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన సాంస్కృతిక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం గుస్సాడీ దండారి ఉత్సవాల ప్రత్యేకతను, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను దగ్గరగా పరిశీలించారు.గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించడంతో పాటు వాటి ప్రాధాన్యతను మరింత విస్తృతంగా చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ప్రాజెక్టు అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ గిరిజన పెద్దలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి : శ్రీకాంత్ రెడ్డి



- సుంకిడలో వైభవంగా గుస్సాడి ఉత్సవాలు

(సిరికొండ, సాక్షర): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ఎంతో గొప్పవని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. శనివారం సిరికొండ మండలంలోని సుంకిడ గ్రామంలో నిర్వహించిన ఆదివాసీల సాంప్రదాయ దండారి (గుస్సాడి) ఉత్సవాల్లో డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తో కలిసి శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు సాంప్రదాయ వాయిద్యాలతో ఆదివాసీలు నాయకులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గిరిజనులతో కలిసి దండారి నృత్యం చేస్తూ నాయకులు ఉత్సాహంగా మమేకమయ్యారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆసిఫ్, సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంచం లక్ష్మణ్, డీసీసీ ఉపాధ్యక్షులు మాధవ్ పటేల్, డీసీసీ కార్యదర్శి ఇమామ్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, గుడిహత్నూర్ మాజీ మండల అధ్యక్షులు అంకత్ రవి, సుంకిడి సర్పంచ్ రాథోడ్ గణపతి, సిరికొండ ఉప సర్పంచ్ తోకల రాజు, బోరిగాం మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ రెడ్డి, సోంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, సుంకిడి ఉప సర్పంచ్ భీంరావు, మార్కెట్ డైరెక్టర్ పురక జగన్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీలత, షేక్ ఇమామ్, కిషన్ పటేల్, కస్నె రామారావు, ఎల్లయ్య, దేవిసెట్, గణపతి, రమేష్, తొడసం భూపతి, జాదవ్ రాదేశ్యం, కోవా వసంత్, జైతు, గోవింద్, పూసం సత్యనారాయణ, శామెందర్, ముక్రం, తదితర గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేటర్ వేధింపులతో దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ కిసాన్‌నగర్‌లో దివ్యాంగుడు కళ్లేపల్లి శివ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. ఆల్‌అవుట్ ద్రావణం తాగిన శివ సెల్ఫీ వీడియో రికార్డ్ చేసాడు. స్థానికులు శివను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు వేధింపుల వల్లే, ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు సెల్ఫీ వీడియోలో శివ ఆరోపించాడు. తన అన్న బీఆర్ఎస్ పార్టీలో ఉండటంతో తమ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. రాజకీయ కారణాలతో తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించాడు. ఇల్లు కూల్చివేస్తామంటూ నోటీసులు జారీ చేయడంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు వెల్లడించాడు. కార్పొరేటర్ వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించినట్లు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. తన ఆత్మహత్యతోనైనా కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసాడు. శివ ఆరోపణలపై విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో విద్యార్థి ఆత్మహత్య..

- కాలేజీ ప్రిన్సిపాల్ వేధింపులే కారణమంటూ విద్యార్థుల ఆందోళన

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పరిధిలో ఉన్న అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో విషాద ఘటన చోటుచేసుకుంది. శనివారం ఉదయం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన తోటి విద్యార్థులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. కాలేజీ ప్రిన్సిపాల్ వేధింపుల కారణంగానే విద్యార్థి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే విద్యార్థులు చేసిన ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదు. విద్యార్థి మృతికి గల అసలు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

భూముల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): లక్ష్మణచందా మండలం కంజర్ గ్రామ భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని సూచించారు.శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కంజర్ గ్రామస్తుల భూముల సమస్యల పరిష్కార విషయంపై లక్ష్మణచందా తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ సమస్యల దరఖాస్తుల సంఖ్య, సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి వివరాలు క్లుప్తంగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుల వివరాలన్నీ పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు.మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దరఖాస్తులన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అవసరమైతే దరఖాస్తులను పై స్థాయికి పంపాలని తెలిపారు. మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియను సమీక్షించారు. భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ

ఈ పెట్టి కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : ఎస్పీ జానకి షర్మిల

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ఎస్పీ సమీక్ష డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జాప్యం చేయొద్దని ఎస్హెచ్ఓలకు ఆదేశాలు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): ఈ పెట్టి కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఏ కేసును కూడా అనవసరంగా పెండింగ్ లో ఉంచవద్దని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఎస్హెచ్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. సైబర్ నేరాలకు సంబంధించిన పెండింగ్ కేసుల పరిష్కారంపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలు, సైబర్ వారియర్స్ తో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు సంబంధించిన కేసులను త్వరగా దర్యాప్తు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలన్నారు.అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించిన డీడీలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఈ విషయంలో ఎలాంటి జాప్యం చేయవద్దని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అన్ని కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, సీఐలు కృష్ణ, మల్లేష్, ఎస్సైలు లింబాద్రి, అశోక్, ముత్యం, మహిళా ఎస్సై శ్రావణితో పాటు డీసీఆర్బీ, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుస్సాడి, దండారీ నృత్యాలు ఆదివాసీల ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు : సోయం బాపూరావు

- దొంగర్ గావ్ లో గుస్సాడి, దండారీ వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



(ఇంద్రవెల్లి, సాక్షర): గుస్సాడి, దండారీ నృత్యాలు ఆదివాసీల ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు అన్నారు. ఇంద్రవెల్లి మండలం దొంగర్ గావ్ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి, దండారీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.గ్రామానికి చేరుకున్న నాయకులకు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో గుస్సాడిలు ఘన స్వాగతం పలికి అతిథులకు శాలువాతో సన్మానించారు. గుస్సాడి, దండారీ నృత్యాలను తిలకిస్తూ కళాకారులను, గ్రామస్తులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న ఆదివాసీ ఆచారాలు, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ యువత చదువులపై దృష్టి సారించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగా లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని, నెట్ వర్క్ సమస్యను తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గుస్సాడి, దండారీ వేడుకలు నిర్వహించుకునేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఆదివాసీ కళలు, సంస్కృతికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆదివాసీ కళాకారులను ప్రోత్సహిస్తూ వారి సంప్రదాయాలకు తగిన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందూర్ బాదు పటేల్, మహాజన్ అర్కా సెడమా రావు, దేవరీ పెందూర్ భీం రావు, సర్పంచ్ విమల బాయి, ఉప సర్పంచ్ సీత బాయి, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్సంగ్ తానాజీ, కనక తులసిరామ్, మోహన్ రావు, రాజ్ గోండ్ సేవ సమితి ఇంద్రవెల్లి అధ్యక్షులు గణేష్, విశాల్, గ్రామ పెద్దలు, ఆదివాసీ మహిళలు, యువత, గుస్సాడి, దండారీ కళాకారులు పాల్గొన్నారు.

మూడు రోజుల వ్యాపారానికీ జీఎస్టీ

(హైదరాబాద్, సాక్షర): దీపావళి కాంతుల సంగతేమో కానీ.. అధికారుల మామూళ్లు, లైసెన్సుల ఫీజులతో పాటు ఈసారి కొత్తగా జీఎస్టీ వసూళ్లు తమకు చుక్కలు చూపెడుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈసారి అన్ని ఫీజులూ అధికం కావడంతో అసలు దుకాణం పెట్టాలా.. వద్దా.. అని చాలామంది ఆలోచిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సుమారు 30-40 మంది హోల్‌సేల్ వ్యాపారులున్నారు. వీరి ద్వారా కేవలం 20 శాతం మాత్రమే వ్యాపారం జరుగుతుండగా, మిగిలిన 80 శాతం అసంఘటిత రంగంలోని రిటైల్ వ్యాపారుల ద్వారా లేదంటే ఆన్‌లైన్‌లో జరుగుతుంటాయి. పెరిగిన ధరలు..: గతంలో బాణాసంచా కొనుగోలుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేసిన వినియోగదారులు ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకే కొనుగోళ్లను పరిమితం చేస్తున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడడంతో పాటు రసాయనాలు, ముడి పదార్థాల ధరలు పెరిగాయని, దానితో టపాసుల ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగాయని పేర్కొంటున్నారు. భద్రతా ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ టపాసుల ఫ్యాక్టరీలను ఎక్కువ కాలం మూసి ఉంచడం తో ఉత్పత్తి కూడా తగ్గిందని శివకాశీ వ్యాపారులు చెబుతున్నారని వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈసారి టపాసుల ఉత్పత్తి వ్యయం 30 శాతానికి పైగానే పెరిగిందని, అయితే ఆ భారం మొత్తం కొనుగోలుదారులపై వేయకుండా తాము కూడా కొంత భరిస్తున్నామని చెబుతున్నారు. రిటైల్ ధరలను పెంచకూడదని ఆల్ ఇండియా ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ నిర్ణయించింది కానీ, మొత్తం భారం తమపై వేసుకుని వ్యాపారం చేయడం అసాధ్యమని వాపోతున్నారు. కొత్తగా జీఎస్‌టీ ఫీజు భారం: సాధారణంగా దీపావళి బాంబుల దుకాణం పెట్టాలంటే పలు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. మొదటగా అగ్నిమాపక శాఖ పర్మిషన్, తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్, పోలీస్ శాఖల నుంచి తీసుకోవాలి. ఈసారి కొత్తగా జీఎస్‌టీ నిబంధనలు జత కలిశాయి. ఆయా శాఖల అనుమతుల కోసం ఒక్కో దుకాణానికి లైసెన్సింగ్ ఫీజులు రూ.20 వేల నుంచి రూ.25 వేలు అవుతుండగా.. కొత్తగా తీసుకొచ్చిన జీఎస్‌టీ ఫీజు సుమారుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. మూడు రోజుల వ్యాపారానికి జీఎస్టీ ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికి తోడు 'మామూళ్లు' కూడా ఉంటాయని, ఒక దుకాణం ఏర్పాటుకు మొత్తం కలుపుకుంటే రూ. 60 వేల నుంచి రూ.70 వేలు ఖర్చు వస్తుందని, ఇక షెడ్డు, సెక్యూరిటీ, అద్దెలు, తదితరాలు వేసుకుంటే రూ.1.50 లక్షల వరకు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల సాధికారత కృషికి రాష్ట్ర స్థాయి పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారతకు విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి పురస్కారాల కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుందని, ఈ సందర్భంగా దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారత కోసం విశేష కృషి చేసిన ఉత్తమ వ్యక్తులు స్వచ్ఛంద సంస్థలకు రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రధానం చేసి సత్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు విధానం, నమూనా, పురస్కారాలకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాల కొరకు అధికారిక వెబ్‌సైట్ https://depwdsctgp.telangana.gov.in లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని అర్హులైన వ్యక్తులు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత నమూనాలో అవసరమైన ధృవీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 16వ తేదీలోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారికి మరో అవకాశం

- అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించి ఓటు హక్కును పునరుద్ధరించుకోవాలి ఈ నెల 21 లోగా ప్రక్రియ పూర్తి చేయాలి



(ఆదిలాబాద్, సాక్షర): ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారు ఎన్యుమరేషన్ ఫారం సమర్పించి ఓటు హక్కును పునరుద్ధరించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు చేపట్టి, ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగింపునకు గురైన వారికి తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎస్డీ జాబితాలో పేర్లు ఉన్నవారు మరోసారి ఎన్యుమరేషన్ ఫారం నింపి సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేరును పునరుద్ధరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్ మాట్లాడుతూ ఏఎస్డీ జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం, గ్రామపంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఓటర్లందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్డీ జాబితాలో పేర్లు ఉండి, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు నిబంధనల ప్రకారం ఫారం-సి ద్వారా మరోసారి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియపై నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.ఓటరు జాబితాలో పేరు తొలగింపునకు గురైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు రెవెన్యూ కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఎన్నికల పర్యవేక్షణ అధికారి నలందప్రియ, నాయబ్ తహసీల్దార్ మధుసూదన్, వివిధ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ ప్రజలకు ఒరిగిందేమీ లేదు



• మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన కేదార్పూర్ యువత బీజేపీ, కాంగ్రెస్ లను వీడి భారీగా చేరికలు

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఆదిలాబాద్ లో బీజేపీ నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న విమర్శించారు. బోరజ్ మండలం కేదార్పూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ పక్కనే మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకొని ఉన్న కేదార్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వాన్ని, మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమయ్యాయని, అందుకే నేడు ప్రజలు, యువత తిరిగి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ ప్రచారం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలను విస్మరిస్తూ, రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. రైతుల పక్షాన నిలవాల్సిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరలు తగ్గుతున్నా పట్టించుకోకుండా కాలయాపన చేయడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డి, మద్దుల ఉషాన్న, సర్పంచ్ సంతోష్ రెడ్డి, మెట్టు ప్రహ్లాద్, పురుషోత్తం, భోజన్న, దయానంద్, మహేష్, బొట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

(హుస్నాబాద్, సాక్షర): దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురు చేస్తున్న పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఘనంగా మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి..కార్యక్రమంలో ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు యజమాని పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు మంత్రి పొన్నం ప్రభాకర్ బట్టలు పెట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సందర్భంగా లబ్దిదారు ఇంట్లో క్రాకర్స్ కాల్చి బాణసంచా పేల్చి ఘనంగా దీపావళి జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ కౌన్సిలర్ లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు. -మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను ప్రజా పాలన ప్రభుత్వంలో సాకారం చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది ఈ దీపావళి పండుగను మా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు హుస్నాబాద్ పట్టణంలో కోమల సమ్మయ్య ఇందిరమ్మ ఇంట్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నాం . ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి 2500 పైగా ఇళ్లు పూర్తయ్యాయి. 500 గుడిసెల స్థానంలో ఇళ్లు, మధ్యలో నిలిచిపోయిన మరో 500 ఇళ్లకు, రెండో దశలో 1,000 ఇళ్లకు మంజూరు అయ్యాయి ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం,పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియ పూర్తి చేస్తాం రూఫ్ లెవల్‌లో ఉన్న లబ్ధిదారులు కూడా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.

ఈ ఏడాది సొంతింటి కల నెరవేరిన పేదల ఇళ్లలో ఆత్మగౌరవంతో, ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగ..!

(రంగారెడ్డి, సాక్షర): శనివారం నాడు రంగారెడ్డి జిల్లా నందిగామలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్గా, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఆయా శాఖల అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా నందిగామలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేయించి, లబ్ధిదారులకు ఆత్మీయ చిరు కానుకలను అందించారు. ''మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'' వేడుక ఘనంగా జరుపుకోవాలని ఆడబిడ్డలను ఆశీర్వదించారు. తరువాత మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో ZPHS పాఠశాల అదనపు తరగతి గదులు, రూ.1. 75 కోట్లతో నిర్మించిన ఎంపీడీవో కార్యాలయం, రూ. 45 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య, అంగన్‌వాడీ భవనాలు, ప్రాథమిక పాఠశాల భవనం, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా నూతన తహశీల్దార్ కార్యాలయ భవనం, పాత NH-7 నందిగామ నుండి నర్సప్పగూడ గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనంతరం నిర్వహించిన పబ్లిక్ మీటింగ్ లో పాల్గొని ప్రజాప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలిపారు. సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతానికి తరలిస్తామని ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. . వెంగిరాల గ్రామంలోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను అదే వేదికగా ఆదేశించాను. స్థానిక రైతులకు భూభారతి పట్టాపాసుబుక్కులను అందజేసారు. ప్రజల సంక్షేమం విషయంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం భేషజాలకు పోదు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది. పేదల ఇళ్లలో వెలుగులు నింపుతూ, వారి కుటుంబాలతో కలిసి పండుగ సంతోషాలను పంచుకోవాలన్న గొప్ప సంకల్పంతో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి రూపకల్పన చేశాంమని అన్నారు.

క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స : డా. జక్కుల శ్రీకాంత్



• ఖానాపూర్ లో లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడం ద్వారా సమర్థవంతమైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని ఆదిలాబాద్ ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డా. జక్కుల శ్రీకాంత్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు క్యాన్సర్ అవేర్ నెస్ డే సందర్భంగా ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఉర్దూ మాధ్యమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డా. జక్కుల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, వివిధ రకాలు, వ్యాధికి దారితీసే ప్రమాద కారకాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. శ్రీకాంత్ మాట్లాడుతూ పొగాకు, గుట్కా, తంబాకు, సిగరెట్ల వినియోగం, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అధికంగా వేయించిన ఆహార పదార్థాల వినియోగం క్యాన్సర్ ముప్పును పెంచే ప్రమాద కారకాలుగా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సంబంధిత క్యాన్సర్ల నివారణకు అందుబాటులో ఉన్న టీకాలు, క్రమం తప్పని వైద్య పరీక్షల ప్రాధాన్యతను వివరించారు.విద్యార్థులు ఈ అవగాహనను తమ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు కూడా తెలియజేసి సమాజంలో క్యాన్సర్ పై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ కింగ్స్ అధ్యక్షులు నూటెంకి సత్యనారాయణ, కార్యదర్శి చొప్పదండి రమేష్ బాబు, కోశాధికారి ఎల్ల ఆనంద్ రెడ్డి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ లయన్ రమాకాంత్, లయన్స్ క్లబ్ సభ్యులు బండారి దేవన్న, బెజ్జంకి రవీంద్ర, భూపతి గౌడ్, లయన్ లేడీ నిఖిని వర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ కింగ్స్ తరపున ముఖ్య అతిథి డా. జక్కుల శ్రీకాంత్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ లో వారు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

12 ఏళ్ల కిడ్నీవ్యాధితో పోరాటం.. చివరకు కొత్త జీవితం



• రోటిగూడకు చెందిన గోపాల్ కు నిమ్స్ లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి సహాయం కోసం కుటుంబం ఎదురుచూపు

(జన్నారం, సాక్షర): గత 12 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో నరకయాతన అనుభవిస్తున్న జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన సేపూరి గోపాల్ కు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. చికిత్స కోసం అప్పులతో ఆర్థికంగా చితికిపోయిన ఆ కుటుంబానికి దాతల సహకారం అవసరమని గ్రామస్తులు కోరుతున్నారు.కుటుంబాన్ని పోషించుకోవాలనే ఆశతో గల్ఫ్ దేశమైన మస్కట్ కు వెళ్లి పనిచేసిన గోపాల్, అక్కడ అధిక పని ఒత్తిడి, తాగునీటి సమస్యలు తదితర కారణాలతో కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు.2014 నుంచి 2020 వరకు ప్రతి నెల సుమారు రూ.10 వేల విలువైన మందులు వాడుతూ చికిత్స పొందారు. అయినప్పటికీ వ్యాధి తీవ్రం కావడంతో 2020 నుంచి 2026 వరకు ప్రతిరోజూ డయాలసిస్ పై ఆధారపడి జీవనం సాగించారు.కిడ్నీ మార్పిడి కోసం 2023లో జీవన్ దాన్ పథకంలో నమోదు చేసుకోగా, ఎట్టకేలకు 2026 అక్టోబర్ 25న హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది.ఒకవైపు ప్రాణాలు నిలుపుకోవడానికి పోరాటం, మరోవైపు కుటుంబ పోషణ, ఇద్దరు పిల్లల భవిష్యత్తు కోసం ఆ కుటుంబం ఎన్నో కష్టాలు ఎదుర్కొంది. అప్పులు చేసి జీవనం సాగిస్తున్న గోపాల్, 2022లో చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని దానిపైనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.కిడ్నీ మార్పిడితో గోపాల్ కు కొత్త జీవితం లభించినప్పటికీ, ఆర్థికంగా ఆ కుటుంబం ఇంకా కోలుకోలేని పరిస్థితిలో ఉంది. చికిత్సకు చేసిన అప్పులు, ప్రస్తుత వైద్య ఖర్చులు ఆ కుటుంబానికి భారంగా మారాయి.ఈ క్లిష్ట సమయంలో దాతల సహకారం ఆ కుటుంబానికి ఎంతో అవసరం. మానవత్వం ఉన్న దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, గల్ఫ్ ప్రవాస భారతీయులు, దాతృత్వ హృదయాలు కలిగిన ప్రతి ఒక్కరూ స్పందించి తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఆర్థిక సహాయం పంపించవలసిన వివరాలు : ఫోన్ పే / గూగుల్ పే : 9999753990.

అమీర్‌పేటలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్య



అమీర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఓ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఆర్ నగర్ పరిధిలోని అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో చదువుతున్న సదరు విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. తమతో కలిసి చదువుతున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటంతో తోటి విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ వేధింపుల వల్లే అతడు ఆత్మహత్య చేసుకున్నాడని.. కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తోటి విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సమాచారమందుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న విద్యార్థులను సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. హోటల్ మేనేజ్ మెంట్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడేందుకు గల కారణాలేంటి..? విద్యార్థులు ఆరోపిస్తున్నట్టుగా ప్రిన్సిపాల్ వేధింపులు ఏమైనా ఉన్నాయా..? ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మాలల చైతన్య మహాగర్జన సభ - పోస్టర్లు ఆవిష్కరణ

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఇటీవల ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ త్రీలో ఉన్న కులాలకు 22 తర్వాత రోస్టర్ పాయింట్లు ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, క్లాసిఫికేషన్ సహేతుకమైనది కాదని, దీనికి హేతుబద్ధత లేదని మాల సంఘాల ప్రతినిధి అల్లూరు భూమన్న తెలిపారు. ఈ నెల 15 ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాలల చైతన్య మహాగర్జన సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.శనివారం మాల సంక్షేమ సంఘ భవనంలో ఈ నెల 15 ఆదివారం జరగబోయే మాలల చైతన్య మహాగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. మాల సంఘాల జేఏసీ, ఎంసీఎఫ్, మాల అనుబంధ కులాల ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహిస్తున్నారు.ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 20 లోపల రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని ప్రధాన డిమాండ్ గా సభ నిర్వహిస్తున్నామని అల్లూరు భూమన్న తెలియజేశారు. ఈ సభకు వేలాది మంది మాల, మాల అనుబంధ కులాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో దుర్గం శేఖర్, ప్రజ్ఞ కుమార్, అయిండ్ల శశికాంత్, బొంగట్ సుభాష్, బొజ్జ రవి, ముట్టపొచ్చన్న, భూమన్న, సూర్యకాంత్, కుమ్మరి సత్యనారాయణ, దాండిగా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్ మెంట్ ఇన్ చార్జిగా దుర్గం శేఖర్

• టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ఆర్డర్ కాపీ అందజేత



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) :ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్సీ డిపార్ట్ మెంట్ ఇన్ చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్ కు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామక ఉత్తర్వులను అధికారికంగా అందజేశారు.శనివారం గాంధీ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో దుర్గం శేఖర్ ను నాయకులు అభినందించి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి దుర్గం శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులు లేని నిర్మాణాల నిలిపివేత

• అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులు చేపడితే చర్యలు పంచాయతీ కార్యదర్శి రవికాంత్



(తానూర్, సాక్షర) తానూర్ మండలం బెల్ తరోడ గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న భవన నిర్మాణ పనులను పంచాయతీ అధికారులు నిలిపివేశారు. భవన నిర్మాణ పనులు చేపట్టే ముందు గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని పంచాయతీ కార్యదర్శి రవికాంత్ సూచించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికాంత్, సర్పంచ్ గొప్ప సుజాత, సాయినాథ్ పర్యటించి ఆక్రమ నిర్మాణ పనులను అడ్డుకున్నారు.ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే పంచాయతీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు నిబంధనలు పాటిస్తూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

భీంసరిలో డెంగ్యూ కేసు నమోదు ... గ్రామంలో స్ప్రే, డ్రై డే కార్యక్రమం



• రోహిత్ ఇంటి చుట్టూ 50 ఇళ్లలో ఫైరిత్రిన్ స్ప్రే - రాత్రి ఫాగింగ్

(భీంసరి, సాక్షర) : భీంసరి గ్రామానికి చెందిన మన్నే రోహిత్ కు డెంగ్యూ కేసు నమోదు కావడంతో గ్రామంలో హెల్త్ సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్ ఆధ్వర్యంలో స్ప్రే కార్యక్రమం నిర్వహించారు. రోహిత్ ఇంటి వద్ద, చుట్టుపక్కల 50 ఇళ్లలో స్ప్రే చేయడంతో పాటు డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.భీంసరి గ్రామానికి చెందిన మన్నే రోహిత్ (14) గత రెండు రోజుల కిందట ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లగా అక్కడ పరీక్షలు చేసి డెంగ్యూ కేసు నిర్ధారించిన వైద్యులు రిమ్స్ కు వెళ్లమని చెప్పారు. వెంటనే రిమ్స్ కు వెళ్లి ఎలీసా టెస్ట్ చేయడం వల్ల డెంగ్యూ కేసుగా ప్రభుత్వ వైద్యులు నిర్ధారించారు. రోహిత్ కు వైద్య పరీక్షలు చేసి మందులను అందించి డిశ్చార్జ్ చేశారు.శనివారం భీంసరి గ్రామంలో గ్రామ సర్పంచ్ గౌరు కార్తీక్, ఉపసర్పంచ్ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బందితో బైలర్వా పిచ్కారి చేయించారు. అదేవిధంగా అంకోలి ఆసుపత్రి సిబ్బంది పర్యవేక్షణలో బొమ్మెత సుభాష్, పవర్ ప్రేమ్ సింగ్ ఆధ్వర్యంలో ఫైరిత్రిన్ స్ప్రేను రోహిత్ ఇంటి వద్ద, చుట్టుపక్కల 50 ఇళ్లలో స్ప్రే చేశారు.గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో, ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని, డ్రైనేజీ వ్యవస్థను దగ్గరుండి పరీక్ష చేసి డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్రపాలి అనే అమ్మాయికి కూడా ఫీవర్ వచ్చినట్లు చూసి తన రిపోర్టులను పరిశీలించారు. డెంగ్యూ గాని, మలేరియా గాని లేదని, మామూలు జ్వరంగా ఉన్నట్లు రిపోర్టులను పరిశీలించారు.ఈరోజు రాత్రి సమయంలో ఫాగింగ్ చేయడం కూడా జరుగుతుందని గ్రామ సర్పంచ్ తెలియజేశారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని చుట్టుపక్కల ఇండ్లలో ఆరోగ్య సలహాలు, సూచనలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మి, గంగమ్మ, కవిత, బ్రీడింగ్ చెక్కర్స్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

అనంతపూర్ లో అంబరాన్నంటిన దండారి ఉత్సవాలు



• గిరిజనులతో కలిసి నృత్యం చేసిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

(బజార్ హత్నూర్, సాక్షర) : మండలం అనంతపూర్ గ్రామంలో ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన దండారి ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై గిరిజన సోదరులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దండారి సంప్రదాయ నృత్యాల్లో స్వయంగా పాల్గొని గిరిజన కళాకారులతో కలిసి నృత్యం చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం గ్రామస్తులతో కలిసి విందు భోజనంలో పాల్గొని వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, స్టేట్ ఎస్సీ డిపార్ట్ మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్, బజార్ హత్నూర్ మండల అధ్యక్షులు కళ్లెం విఠల్, వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ రమేష్, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, బజార్ హత్నూర్ మాజీ మండల అధ్యక్షులు జల్కె పాండురంగ్, గిర్నూర్ సర్పంచ్ దినేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందు, గుడిహత్నూర్ మాజీ అధ్యక్షులు అంకత్ రవి, జిల్లా మీడియా కమ్యూనికేషన్ జితేందర్, బోరజ్ ఎస్సీ డిపార్ట్ మెంట్ అధ్యక్షులు పొట్ట అశోక్, గుడిహత్నూర్ ఉపాధ్యక్షులు మొయితే మారుతి, గుడిహత్నూర్ స్పాక్స్ పర్సన్ ఆడే జైపాల్, పోలె విష్ణు, సూర్యవంశీ పాండురంగ్, గంగాధర్, ఉత్తమ్, జగన్, సందీప్, గణేష్, దేవన్న, బాబా రావు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చేతి ముద్ద... మరిచిపోయిన తరం!



ఒకే ఇంట్లో ఉంటున్నాం... కానీ మనసులతో ఎంత దూరమయ్యాం? ఆదివారం అంటే ఒకప్పుడు కుటుంబానికి పండుగ! ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఒక స్క్రీన్‌తో గడిపే సెలవు! ఒకప్పుడు ఆదివారం వచ్చిందంటే చాలు... ఇంట్లోనే ఓ చిన్న పండుగ వాతావరణం కనిపించేది. అమ్మ తెల్లవారుజామునే లేచి వేడివేడి ఇడ్లీలు, పొంగల్, పూరీలు, చికెన్ కర్రీ... ఇలా పిల్లలకు ఇష్టమైన వంటకాలతో వంటింటిని సందడిగా మార్చేది. నాన్న పిల్లలతో కూర్చుని కబుర్లు చెప్పేవాడు. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు కలిసి ఆడుకునేవారు. భోజనం దగ్గర నవ్వులు, అల్లర్లు, సరదా మాటలు... ఇల్లంతా ఆప్యాయతతో నిండిపోయేది. మరి ఇప్పుడు ఆదివారం అంటే ఏమిటి? అమ్మ ఒక గదిలో టీవీ సీరియల్‌లో మునిగిపోతుంది. నాన్న మరో గదిలో వార్తలు చూస్తుంటాడు. కొడుకు మొబైల్‌లో గేమ్స్ ఆడుతుంటాడు. కూతురు సోషల్ మీడియాలో మునిగిపోతుంది. ఎవరి చేతిలో వారికి ఓ ఫోన్... ఎవరి ప్రపంచం వారిదే!ఒకే ఇంట్లో ఉంటున్నాం. ఒకే గోడల మధ్య జీవిస్తున్నాం. కానీ మనసులు మాత్రం ఎక్కడో దూరమైపోతున్నాయి! ఒకప్పుడు కుటుంబ సభ్యుల మధ్య మాటలు ఉండేవి... ఇప్పుడు వాటి స్థానంలో మెసేజ్‌లు వచ్చాయి. ఒకప్పుడు అమ్మ పిలిస్తే పలికేవాళ్లం... ఇప్పుడు ఫోన్ మోగితేనే ఉలిక్కిపడుతున్నాం! ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుందాం! మన సోషల్ మీడియా ఖాతాల్లో వేలాది మంది స్నేహితులు ఉన్నారు. వారి ఫొటోలకు లైకులు కొడుతున్నాం. వారి జీవితాల గురించి తెలుసుకుంటున్నాం. కానీ మన పక్కనే కూర్చున్న అమ్మ మనసులో ఏముందో అడిగామా? నాన్న రోజంతా మన కోసం ఎంత కష్టపడుతున్నాడో ఆలోచించామా? ఆయనకు ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? అమ్మకు ఒంటరితనం వేధిస్తోందా? అని ఎప్పుడైనా ప్రేమగా పలకరించామా? గుర్తుంచుకోండి... ఫోన్‌లో మనకు వేలమంది ఫాలోవర్లు ఉండొచ్చు. కానీ జీవితంలో మన కోసం నిస్వార్థంగా ఎదురుచూసే వారు అమ్మానాన్నలే! అమ్మ చేతి ముద్దలో కేవలం అన్నం ఉండదు... అందులో ప్రేమ ఉంటుంది, ఆప్యాయత ఉంటుంది, తన బిడ్డ కడుపు నిండాలనే తపన ఉంటుంది. హోటల్‌లో దొరికే వందల రకాల వంటకాల్లో లేని రుచి అమ్మ చేతి ముద్దలో ఉంటుంది. నాన్న ప్రేమ ఎప్పుడూ మాటల్లో కనిపించకపోవచ్చు. కానీ తన అవసరాలను పక్కనపెట్టి మన అవసరాలను తీర్చడంలో ఆయన జీవితమంతా దాగి ఉంటుంది. మనకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి తమ వర్తమానాన్ని త్యాగం చేసినవారు అమ్మానాన్నలు! కానీ మనం వారికి ఇస్తున్న సమయం ఎంత? వారితో కూర్చుని మాట్లాడటానికి పది నిమిషాలు కూడా లేవా? వారి మాటలు వినడానికి ఓపిక లేదా? వారి పక్కన కూర్చోవడానికి సమయం లేదా? ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి... బాల్యంలో మనం నడవలేకపోతే అమ్మ చేయి పట్టుకుని నడిపించింది. మనం మాట్లాడలేకపోతే నాన్న మనకు మాటలు నేర్పించాడు. మనం ఎదగడానికి తమ జీవితాలను అంకితం చేశారు. ఇప్పుడు వారికి కావాల్సింది పెద్ద పెద్ద బహుమతులు కాదు... మన సమయం, మన పలకరింపు, మన ఆప్యాయత మాత్రమే! ఈ ఆదివారం ఒక చిన్న మార్పు తీసుకురండి! ఉదయం కనీసం 10 గంటల వరకు ఫోన్‌ను పక్కన పెట్టండి. అమ్మ పక్కన కూర్చుని ఆమె చేతి వంటను ప్రేమగా తినండి. నాన్నతో పది నిమిషాలు మనసు విప్పి మాట్లాడండి. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని అందరూ కలిసి నవ్వుకోండి. కుటుంబ సభ్యులంతా ఒకచోట కూర్చుని కనీసం ఒక్కసారైనా కలిసి భోజనం చేయండి. ఆ క్షణాలను ఫొటోల్లో బంధించడం కంటే మనసులో పదిలపరుచుకోండి! ఎందుకంటే... ఫోన్ బ్యాటరీ అయిపోతే మళ్లీ ఛార్జ్ చేసుకోవచ్చు. కానీ అమ్మానాన్నలతో గడపాల్సిన సమయం ముగిసిపోతే... తిరిగి తీసుకురాలేం! ఫోన్ మనకు ప్రపంచాన్ని చూపిస్తుంది. కానీ కుటుంబం మనకు జీవితాన్ని పరిచయం చేస్తుంది. ఫోన్ మనకు లైకులు ఇస్తుంది... అమ్మానాన్నలు మనకు దీవెనలు ఇస్తారు. లైకులు ఎన్ని వచ్చినా జీవితానికి భరోసా ఇవ్వలేవు. కానీ తల్లిదండ్రుల దీవెనలు మన ప్రయాణానికి కొండంత అండగా నిలుస్తాయి. చివరిగా ఒక్క మాట... అమ్మ చేతి ముద్ద తినడానికి, నాన్న పక్కన కూర్చుని కబుర్లు చెప్పుకోవడానికి, కుటుంబంతో కలిసి నవ్వుకోవడానికి రేపటి వరకు వేచి ఉండకండి! ఎందుకంటే బాల్యం తిరిగిరాదు... గడిచిన కాలం వెనక్కి రాదు... తల్లిదండ్రులతో గడపాల్సిన ప్రతి క్షణం అమూల్యమైనది. ఈ ఆదివారం ఫోన్‌కు కొంత విశ్రాంతి ఇవ్వండి... కుటుంబానికి కొంత సమయం ఇవ్వండి! ఇల్లు అంటే నాలుగు గోడలు కాదు... మనుషుల మధ్య ఉండే ప్రేమ, అనుబంధం, ఆప్యాయత! ఫోన్‌లో ప్రపంచాన్ని వెతకడం కాసేపు ఆపి... మీ ఇంట్లోనే ఉన్న ప్రపంచాన్ని ఒక్కసారి చూడండి! అదే నిజమైన ఆదివారం... అదే కుటుంబం... అదే జీవితం! --(వ్యాసకర్త, ఉక్కల్కర్ రాజేందర్ నాథ్, డీఏఈ (భారత అణుశక్తి శాఖ) ట్రైనీ జర్నలిస్ట్,కామారెడ్డి జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు, సెల్: 9440287170)

రిమ్స్ లో వెంటిలేటర్ల చోరీ కేసు ఛేదన

• అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ రూ. 32 లక్షల విలువైన 4 వెంటిలేటర్లు స్వాధీనం టెక్నీషియన్ల ముసుగులో చోరీ కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్పీ అఖిల్ మహాజన్



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో రూ.32 లక్షల విలువ చేసే వెంటిలేటర్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. టెక్నీషియన్ల ముసుగులో వచ్చి చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను అరెస్ట్ చేసి నాలుగు వెంటిలేటర్లతో పాటు ఇతర వైద్య పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.గత నెల 30వ తేదీన మహారాష్ట్ర చంద్రపూర్ కు చెందిన సజ్జన్ బసంత్ మోతే, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్లుగా రిమ్స్ ఆసుపత్రిలోకి ప్రవేశించారు. ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్ఐసీయూ, సారీ వార్డులలో రోగులకు అత్యవసర చికిత్స అందించే నాలుగు మైండ్ రే బ్రాండ్ వెంటిలేటర్లను చోరీ చేసి మహారాష్ట్రకు తరలించారు.అనంతరం చోరీ చేసిన వైద్య పరికరాలను విక్రయించేందుకు హైదరాబాద్ కు చెందిన మెడికల్ ఎక్విప్మెంట్ సేల్స్ అండ్ సర్వీస్ వ్యాపారి కొండా రెడ్డిని సంప్రదించారు. దొంగిలించిన వస్తువులని తెలిసి కూడా కొనుగోలు చేసేందుకు అంగీకరించిన కొండా రెడ్డి వాటిని కొనుగోలు చేయడానికి చంద్రపూర్ కు వచ్చాడు. వైద్య పరికరాలను కారులో పెట్టుకుని హైదరాబాద్ కు వెళ్తుండగా ఆదిలాబాద్ ఆర్టీవో కార్యాలయం సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ పలు చోరీలు... విచారణలో నిందితులు గతంలో మహారాష్ట్రలోని చంద్రపూర్ వద్ద గల నాగ్భీడ్, వని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వైద్య పరికరాలను చోరీ చేసినట్లు వెల్లడించారు. వీరు దొంగిలించిన వైద్య పరికరాలను హైదరాబాద్ కు చెందిన కొండా రెడ్డికి విక్రయించినట్లు విచారణలో తేలింది.పోలీసులు నిందితుల వద్ద నుంచి రిమ్స్ ఆసుపత్రిలో చోరీ చేసిన నాలుగు వెంటిలేటర్లు, నిజామాబాద్ ఆసుపత్రిలో చోరీ చేసిన ఒక వెంటిలేటర్, ఒక ఎన్ఎస్టీ మిషన్, మహారాష్ట్ర వని ఆసుపత్రిలో చోరీ చేసిన ఫీటల్ మానిటర్, చంద్రపూర్ నాగ్భీడ్ ఆసుపత్రిలో చోరీ చేసిన డయాథెర్మీ మిషన్ తో పాటు రూ.1 లక్ష నగదు, సెల్ ఫోన్లు, ఒక బైక్, కారు స్వాధీనం చేసుకున్నారు. కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్పీ రోగుల ప్రాణాలకు అవసరమైన వైద్య పరికరాలను చోరీ చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యని ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్య పరికరాల కొనుగోలు, విక్రయాల విషయంలో అనుమానాస్పద లావాదేవీలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సిబ్బందిని అభినందించారు.సీసీటీవీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో దొంగలు దొంగతనాలు చేయడానికి వెనుకాడతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయాలని కోరారు.నిందితుల సజ్జన్ బసంత్ మోతే (43), తండ్రి బాసన్, నివాసం మహంకాళి వార్డు, చంద్రపూర్, మహారాష్ట్ర - అరెస్ట్అభిజిత్, చంద్రపూర్, మహారాష్ట్ర - పరారీమేడం కొండా రెడ్డి (35), తండ్రి చిన్నమాల కొండా రెడ్డి, నివాసం ప్రగతి నగర్, హైదరాబాద్ - అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. నాగరాజు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై అఖిల్, ఆర్ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది హెచ్సీ రమణ, క్రాంతి, త్రిశూల్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్....

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ పశ్చిమ ప్రాంత వాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించే దిశగా మరో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నాలుగు లేన్ల స్టీల్ రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మించేందుకు అధికారులు రెడీ అయ్యారు. గుల్మోహర్ జంక్షన్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవున ఈ బ్రిడ్జిని నిర్మించనున్నారు. జంక్షన్ల అభివృద్ధితో కలిపి ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.308 కోట్లుగా నిర్ణయించారు. ఈ నిర్మాణం పూర్తయితే ఐటీ కారిడార్‌తో పాటు తెల్లాపూర్, నల్లగండ్ల, గచ్చిబౌలి ప్రాంతాల ప్రజలకు భారీ ఊరట లభించనుంది.తొలుత లింగంపల్లి రైల్వే ట్రాక్‌పై బౌస్ట్రింగ్ తరహా నిర్మాణాన్ని చేపట్టాలని ప్రతిపాదించారు. అయితే రైల్వే స్టేషన్‌లో భవిష్యత్తులో చేపట్టనున్న రైల్వే ట్రాక్‌ల డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులను దృష్టిలో ఉంచుకుని డిజైన్‌లో మార్పులు చేశారు. రైల్వే అధికారులు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారుల సంయుక్త పరిశీలన తర్వాత స్టీల్ సూపర్‌స్ట్రక్చర్‌తో ఆర్ఓబీ నిర్మించాలని నిర్ణయించారు. సాధారణ కాంక్రీట్ నిర్మాణంతో పోలిస్తే స్టీల్ నిర్మాణం ద్వారా పనులను వేగంగా పూర్తి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.అంతేకాకుండా నిర్మాణ సమయంలో రైళ్ల రాకపోకలకు, స్థానిక రహదారులపై వాహనాల ప్రయాణానికి తక్కువ అంతరాయం కలిగే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టులో గుల్మోహర్ జంక్షన్ వైపు నుంచి రెండు లేన్ల అప్‌ర్యాంప్‌ను కూడా నిర్మించనున్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో మరో కీలక మార్పు చేశారు. హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హెచ్‌యూఎంటీఏ)తో చర్చల తర్వాత గచ్చిబౌలి-బీహెచ్ఈఎల్ వైపు వెళ్లే రహదారిని గుల్మోహర్ పార్క్ జంక్షన్ దాటి పొడిగించేలా బ్లూప్రింట్‌ను సవరించారు. దీనివల్ల గచ్చిబౌలి నుంచి బీహెచ్ఈఎల్ వైపు వెళ్లే వాహనాలు నేరుగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాహనాల రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నల్లగండ్ల ఆర్ఓబీపై ఒత్తిడి కూడా తగ్గనుంది.మరోవైపు.. శేరిలింగంపల్లి ఆర్ఓబీ నుంచి బీహెచ్ఈఎల్ వైపు వెళ్లే మార్గంలో తరానగర్ సమీపంలో ట్రాఫిక్ సమస్యను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం 60 నుంచి 80 అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిని ఆమోదించిన రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు విస్తరించాల్సి ఉంది. ఈ అవసరాలను పరిగణనలోకి తీసుకుని గచ్చిబౌలి వైపు నుంచి వచ్చే 2 లేన్ల అప్‌ర్యాంప్‌ను కూడా పొడిగించేలా అంచనాలను సవరించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ముఖ్యంగా తెల్లాపూర్ ప్రాంత ప్రజలకు పెద్ద ప్రయోజనం కలగనుంది. గత కొన్నేళ్లుగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్‌లో నివాస సముదాయాలు పెరుగుతుండటంతో గచ్చిబౌలి, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య కూడా అధికమైంది. అయితే లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్‌పాస్ (ఆర్‌యూబీ) వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు అండర్‌పాస్‌లోకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. రైల్వే ట్రాక్ దాటేందుకే అదనంగా 15 నుంచి 20 నిమిషాల సమయం వృథా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. కొత్త ఆర్ఓబీ అందుబాటులోకి వస్తే వర్షపు నీటితో అండర్‌పాస్ మూసుకుపోయే సమస్య నుంచి ఉపశమనం లభించనుంది.జంక్షన్ల అభివృద్ధితో కలిపి ఈ ప్రాజెక్టుకు రూ.308 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఆర్ఓబీ నిర్మాణ పనులకు సంబంధించి హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు రూ.133.36 కోట్లతో టెండర్ ఆమోదించినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే లింగంపల్లి, తెల్లాపూర్, నల్లగండ్ల, గచ్చిబౌలి, బీహెచ్ఈఎల్ ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, స్థానిక నివాసితులకు ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

ఎస్ఎల్‌బీసీ(SLBC) పూర్తి చేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యం : కల్వకుంట్ల కవిత

(నల్గొండ, సాక్షర): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో టన్నెల్ బోరింగ్ మెషీన్లపై తగిన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ఎస్.ఎల్.బి.సి పనులు పూర్తికాలేదని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు . ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ జాప్యం కారణంగా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. గత ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా. ఎస్.ఎల్.బి.సి పూర్తయితే అదనంగా 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలోని డిండి రిజర్వాయర్‌ను సందర్శించి, డిండి ఎత్తిపోతల పథకానికి ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. డిండికి ఏదుల నుంచి నీళ్లు తేవడం అంత సులువు కాదు. ఏదులకే 2 టీఎంసీల నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఎల్లూరు పంపుహౌస్ డిజైన్ మార్పుతో పాలమూరుకు నష్టం చేశారు. కాళేశ్వరం అడిషనల్ టీఎంసీతో బస్వాపూర్ మీదుగా డిండి ఎత్తిపోతలకు నీళ్లు ఇవ్వడమే శాశ్వత పరిష్కారం. నల్గొండకు నీళ్లు తేవటం చేతకాక అధికార పార్టీ నేతలు రెండు జిల్లాల మధ్య పంచాయితీ పెడుతున్నారు. ఈ ముఖ్యమంత్రిని రేసుగుర్రం అనుకుంటే కీలుగుర్రంగా మారిపోయాడు. ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ నాన్ పర్ ఫార్మింగ్ అసెట్ గా మిగిలిపోయిందని అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, పరిష్కారాలు చూపుతోంది టీఆర్ఎస్ మాత్రమే. రాష్ట్రంలో 80 శాతం పూర్తైన ప్రాజెక్ట్ లు కట్టకుండా ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో రెండు కండ్ల సిద్ధాంతం పార్టీలో ఉన్న ఆయన ఇప్పుడు మహబూబ్ నగర్, నల్గొండ రెండు కండ్లు అని చెబుతున్నారు. కానీ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లను పెండింగ్ పెట్టి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల మధ్య పంచాయితీ పెడుతున్నాడు. కృష్ణానీళ్ల వినియోగానికి సంబంధించి ఎదుల నుంచి డిండి కి నీళ్లు తెస్తామని చెబుతున్నారు. ఏదుల నుంచి డిండి కి నీళ్లు తేవడం అంత సులువు కాదు.. అసలు శ్రీశైలం నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకే 2 టీఎంసీల నీళ్లు తీసుకోలేమని అన్నారు. ఎల్లూరు పంపుహౌస్ ను ఓపెన్ కట్ నుంచి అండర్ గ్రౌండ్ గా మార్చడంతోనే సమస్య వచ్చింది. శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకునే లెవల్ 800 అడుగుల నుంచి 820 అడుగులకు పెరిగింది. అప్రోచ్ చానల్ 140 మీటర్ల నుంచి 50 మీటర్లకు తగ్గిపోయింది. ఎల్లూరు పంపుహౌస్ కోసం చేపట్టిన బ్లాస్టింగ్స్ తో కల్వకుర్తి పంపు హౌస్ లో ఒక పంపు పేలిపోయింది.. ఏళ్లు గడిచినా దాన్ని రీస్టోర్ చేయలేదు . మళ్ళీ ఇప్పుడు 0.6 టీఎంసీల కోసం ఇంకో సోర్స్ కోసం పంపు హౌస్ తవ్వితే కల్వకుర్తి, పాలమూరు పంపు హౌస్ లకు ప్రమాదం తప్పదు. ఇన్ని అడ్డంకుల మధ్య ఏదుల నుంచి డిండి కి లింక్ చేస్తామనడం రెండు జిల్లాల ప్రజల మధ్య తగువులు పెట్టించడమే. డిండి కి నీళ్లు తేవాలన్న కూడా స్పష్టమైన సోర్స్ పాయింట్ ఉండాలి. కానీ దానిపై ఎలాంటి సర్వే లేకుండానే ముఖ్యమంత్రి ఎదుల నుంచి సోర్స్ పాయింట్ అని చెబుతున్నారని అన్నారు. గోదావరి, కావేరి అనుసంధానం తుపాకుల గూడెం వద్దే జరిగేలా చూడాలి. నాగార్జున సాగర్ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్ట్ లు పూర్తి చేయాలి. రాష్ట్రంలో ఉన్న అన్ని సమస్యలపై పోరాడుతూనే వాటికి పరిష్కార మార్గాలను మేము వెతుకుతున్నాం. మా టీమ్ చిన్నదైనా సరే ప్రజల కోసం కష్టపడే టీమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసింది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్ సహా మిగతా పార్టీలు మొద్దు నిద్రపోతున్నాయి. వాళ్లకు బుద్ధి చెప్పే అవకాశం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో వచ్చింది. కనుక ప్రజల కోసం పోరాటం చేస్తున్న మా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నానని అన్నారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి : ఎస్పీ అఖిల్ మహాజన్


- అధిక లాభాలు, గిఫ్ట్ ఆఫర్లు, నకిలీ లోన్ ల పేరుతో సైబర్ మోసాలు వారం రోజుల్లో జిల్లాలో 23 ఫిర్యాదులు



(ఆదిలాబాద్, సాక్షర): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతూ ప్రజల డబ్బును దోచుకుంటున్నారని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గత వారం రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 23 సైబర్ ఫిర్యాదులు నమోదైనట్లు వెల్లడించారు.ఆన్ లైన్ కొనుగోళ్లు, యూపీఐ లావాదేవీలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఓటీపీ మోసాలు, నకిలీ లోన్ ఆఫర్లు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్ వంటి ఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును గుర్తించి నిలిపివేసే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పంపవద్దని సూచించారు.

రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి : కలెక్టర్ రాజర్షి షా

- ఆత్మహత్యల నివారణకు విస్తృత అవగాహన కల్పించాలి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఎల్‌నినో ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్లో భరోసా కల్పించాలని, పంట రుణాల రీషెడ్యూలింగ్‌పై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. రైతుల ఆత్మహత్యల నివారణకు గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.శనివారం సంబంధిత శాఖల అధికారులు, డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో రైతుల సంక్షేమం, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో 33 శాతానికి పైగా పంట నష్టం జరిగిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ వేగంగా సేకరించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రైతులు తీసుకున్న పంట రుణాలను బ్యాంకుల ద్వారా రీషెడ్యూల్ చేసేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ వెసులుబాటుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలు, బ్యాంకులు కల్పిస్తున్న రుణ సదుపాయాలపై రైతులకు సరైన సమాచారం చేరవేయాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలి, విస్తృత ప్రచారం చేపట్టాలని డీపీఓ, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రైతుల్లో ఉన్న అపోహలు, ఆందోళనలను తొలగించి ధైర్యం కల్పించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆత్మహత్యల నివారణకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం పింఛన్ దరఖాస్తులు, దివ్యాంగుల యూడీఐడీ ధ్రువీకరణ పత్రాలు, బీడీ కార్మికుల పింఛన్లపై సమీక్షించారు. అనర్హులు, సందేహాస్పదంగా ఉన్న కేసులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరపాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వెలమ సామాజిక వర్గ అభ్యున్నతికి కార్పొరేషన్ కృషి చేయాలి :కూచాడి శ్రీహరిరావు



- వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు శుభాకాంక్షలు

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) తెలంగాణ తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జువ్వాడి నర్సింగరావును కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్ చార్జి కూచాడి శ్రీహరిరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెలమ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించారని పేర్కొన్నారు.అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్న క్రమంలో వెలమ సామాజిక వర్గానికి కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నూతన చైర్మన్ జువ్వాడి నర్సింగరావు నాయకత్వంలో వెలమ సామాజిక వర్గంలోని మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి మరిన్ని ప్రయోజనాలు చేకూరాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కౌంటింగ్ వేళ.. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్

- ఏపీలో కొనసాగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- అవాంఛనీయ ఘటనల నివారణకు పోలీసుల భారీ బందోబస్తు
- కర్నూలులో వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్
- నందికొట్కూరు కౌంటింగ్ కేంద్రానికి వెళ్తుండగా గృహ నిర్బంధం



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ముందుజాగ్రత్త చర్యగా కర్నూలు జిల్లాకు చెందిన వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నందికొట్కూరులోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధార్థ్ రెడ్డి తన ఇంటి నుంచి బయలుదేరారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు భారీగా ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన బయటకు రాగానే అడ్డుకుని, హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆయన ఇంటి వద్ద స్వల్ప ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిషత్ ఎన్నికల పోలింగ్ జరిగిన రోజున కూడా శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని గృహ నిర్బంధం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కౌంటింగ్ సందర్భంగా కూడా ఎలాంటి ఘర్షణలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, కీలక నేతలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు రాకుండా కట్టడి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగానే సాగుతోంది.

నీ భర్త ఒప్పుకుంటే నిన్ను తీసుకెళ్లిపోతా

(హైదరాబాద్, సాక్షర): నీతో ఏకాంతంగా గడపాలని ఉంది.. 20 ఏళ్ల ముందు పుట్టి ఉంటే నేనే నిన్ను పెళ్లి చేసుకునేవాడిని అని ఆమెను వేధించాడు. ఇది అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, అల్లూస్ జానయ్య భాగోతం. అల్లూస్ జానయ్య తనను లైంగికంగా వేధించాడని మహిళా ప్రొఫెసర్ తేజశ్రీ మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆమె మాట్లాడారు. డీజీపీ, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేసారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వచ్చాయని బాధితురాలు చెబుతోంది. నీ భర్త వదిలేస్తే నిన్ను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నానంటూ తనను జానయ్య తరచూ వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఆరోపించింది. అల్లూస్ జానయ్యను తండ్రిలా భావిస్తే.. నువ్వు ఢిల్లీకి రావాల్సింది, నిన్ను ట్రాన్స్‌ఫర్ చేస్తానని బెదిరించారని తేజశ్రీ కన్నీరు పెట్టుకుంది.

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును రికార్డు చేయాలి:మంత్రి పొన్నం ప్రభాకర్



(హుస్నాబాద్, సాక్షర): హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న వినతులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న సమస్యలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, విద్యుత్, విద్యుత్ స్తంభాలు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన వినతులు ఎక్కువగా వస్తున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతిపత్రాలు సమర్పించడానికి వచ్చే సామాన్య ప్రజల పట్ల అధికారులు దయతో, గౌరవంగా వ్యవహరించాలని, ప్రతి వినతిపత్రం తప్పనిసరిగా రికార్డులో ఉండాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో తాను స్వయంగా పాల్గొంటానని తెలిపారు. గ్రామాల్లో భర్తను కోల్పోయిన మహిళలకు వితంతు పెన్షన్ 15 రోజుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్మల్ కు చేరుకున్న అజార్ హుస్సేన్ కు ఘన సన్మానం

- టీపీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీకి శాలువా, పూలమాలతో సత్కారం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): మక్కా పర్యటనను విజయవంతంగా ముగించుకొని నిర్మల్ పట్టణానికి చేరుకున్న టీపీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ అజార్ హుస్సేన్ కు ఘన స్వాగతం లభించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.మక్కా పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీతో పాటు పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అజార్ హుస్సేన్ కు అభినందనలు తెలియజేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి : సర్పంచ్ సుమలత

- చింతగూడ రైతు వేదికలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన



(జన్నారం, సాక్షర): గ్రామంలోని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి లబ్ధి పొందాలని చింతగూడ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ తెలిపారు. శనివారం గ్రామంలోని రైతు వేదికలో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల పట్ల రైతులకు నష్టం జరగకుండా ఉండడానికి అధికారులు తగు సూచనలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని రైతులు వారి సూచనలను పాటిస్తూ లబ్ధి పొందాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై సంబంధిత అధికారులు రైతులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరన్న, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మహేష్, సాద్వి, ఉద్యానవన అధికారిని, సహజ ప్యాక్స్ చైర్మన్ నాసాని రాజన్న, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక అవార్డు పొందిన వికలాంగులకు ప్రత్యేక అవార్డులు

- జిల్లా సంక్షేమ అధికారి డి. సౌమ్య ఈ నెల 16 లోగా దరఖాస్తులు సమర్పించాలి వికలాంగ విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు అవకాశం

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మక అవార్డు పొందిన వికలాంగ విద్యార్థులు, వికలాంగ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డుతో సత్కరించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి డి. సౌమ్య తెలిపారు. ఈ అవార్డు కోసం ఈ నెల 16వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.వికలాంగుల ఉన్నతి కోసం పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థలు, ఇతర అసోసియేషన్లు, వికలాంగుల కోసం సాంకేతికంగా పాటుపడిన వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక అవార్డుతో సత్కరించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అవార్డు కోసం తమ సేవకు సంబంధించిన ప్రతిష్టాత్మక అవార్డు పొందిన వికలాంగ విద్యార్థులు, వికలాంగ ఉద్యోగులు తమ తమ ధ్రువ పత్రాలతో పాటు ప్రశంస పత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ లోగా సమర్పించవలసిందిగా జిల్లా సంక్షేమ అధికారి డి. సౌమ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఇతర వివరాల కోసం, దరఖాస్తు ఫారం కోసం depwdsctgp.telangana.gov.in సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

ఈనెల 10న ఎంపీడబ్ల్యూ పోస్టుల రాత పరీక్ష

- అభ్యర్థులు 2 గంటల ముందు హాజరు కావాలి జిల్లా పరిషత్ హాల్ లో పరీక్ష - 50 ప్రశ్నలు, 100 మార్కులు

(ఆదిలాబాద్, సాక్షర): నేషనల్ ఆయుష్ మిషన్ కింద వివిధ పోస్టుల భర్తీకి ఎంపీడబ్ల్యూ పోస్టుల రాత పరీక్షను నవంబర్ 10న నిర్వహించనున్నట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. అభ్యర్థులందరూ పరీక్ష సమయానికి 2 గంటల ముందు హాజరు కావాలని కోరారు.నేషనల్ ఆయుష్ మిషన్ కింద వివిధ పోస్టుల భర్తీకి ఎంపీడబ్ల్యూ పోస్టుల రాత పరీక్షను మంగళవారం ఈనెల 10న రోజున జిల్లా పరిషత్ హాల్ లో నిర్వహించడం జరుగుతుంది.అభ్యర్థులందరూ పరీక్ష సమయానికి 2 గంటల ముందు పరీక్ష హాల్ కు హాజరు కావాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ హోమియో డిస్పెన్సరీ, రిమ్స్, ఆదిలాబాద్, ఆయుష్ డిపార్ట్మెంట్, ఆదిలాబాద్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ : 8639785919 సంప్రదించాలని తెలిపారు.

భారీగా దేశీదారు పట్టివేత



(జైనథ్/ ఆదిలాబాద్, సాక్షర): మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం రవాణా చేస్తున్నారన్న ఖచ్చితమైన సమాచారం మేరకు పెండల్వాడ గ్రామ శివారు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా మొత్తం 66.24 లీటర్ల దేశీదారు మద్యంను పట్టుకున్నట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 7 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆదిలాబాద్, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఆదిలాబాద్ సంయుక్తంగా నిర్వహించిన దాడులలో కొందరు మహారాష్ట్ర నుండి దేశీదారు మద్యం రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు పెండల్వాడ గ్రామ శివారు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు.మహారాష్ట్రలోని పిప్పల్ కుటి దేశీదారు మద్యం షాపు నుండి పెండల్వాడ గ్రామానికి నడక మార్గాన నెత్తిమీద దేశీదారు పెట్టెలు పెట్టుకొని పెండల్వాడ గ్రామానికి చెందిన బావునే శ్రీనివాస్, లాంగ్డే మారుతి, లాంగ్డే సునీల్, తప్రే రాజు, బావునే సుభాష్ లు అధికారులను చూసి వారి నెత్తిమీద ఉన్న దేశీదారు మద్యం పెట్టెలు వదిలి పారిపోయారు.పిదప అధికారులు వాటిని లెక్కించగా సుమారు 90 ఎం.ఎల్ పరిమాణం గల 36 లీటర్ల గల 400 దేశీదారు మద్యం బాటిళ్లను, 180 ఎం.ఎల్ పరిమాణం గల 30.24 లీటర్ల గల 168 దేశీదారు మద్యం బాటిళ్లను మొత్తం 66.24 లీటర్ల దేశీదారు మద్యంను పట్టుకున్నట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆకుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ దాడులలో ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆకుల శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఆదిలాబాద్ సబ్ ఇన్స్ పెక్టర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది మధు, వెంకటేష్, హరీష్, బీరయ్య పాల్గొన్నారు.ఎవరైనా దేశీదారు మద్యం రవాణా, విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.

ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకలు : డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్



(బజార్ హత్నూర్, సాక్షర): దండారి (గుస్సాడి) ఉత్సవాలు కేవలం పండుగలు మాత్రమే కాదని, అవి ఆదివాసీల తరతరాల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ అన్నారు. బజార్ హత్నూర్ మండలం అనంతపూర్ (పంగడి) గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ హాజరై గిరిజన సోదరులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, స్టేట్ ఎస్సీ డిపార్ట్ మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దండారి (గుస్సాడి) సంప్రదాయ నృత్యాల్లో స్వయంగా పాల్గొని గిరిజన కళాకారులతో కలిసి నృత్యం చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం గ్రామస్తులతో కలిసి విందు భోజనంలో పాల్గొని వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు.విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, కళలకు నిలయమైన ఆదిలాబాద్ జిల్లా గిరిజన పల్లెలు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా నిలుస్తున్నాయి. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ఆచారాలు, కట్టుబాట్లు, సంప్రదాయ కళలను ఆదివాసీ సమాజం నేటికీ ఎంతో వైభవంగా కొనసాగిస్తూ తమ సంస్కృతిని కాపాడుకుంటోంది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదివాసీ కళలు, ఆచారాలు, సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవని, వాటిని భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు గిరిజన కళాకారులను ప్రోత్సహించి, వారి కళలకు తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతపూర్ (పంగడి) గ్రామంలో గిరిజన సోదరులతో కలిసి ఈ సంప్రదాయ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, గిరిజనుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ తన సంపూర్ణ మద్దతు ఉంటుందని డా. నరేష్ జాదవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్ మండల అధ్యక్షులు కళ్లెం విఠల్, వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ రమేష్, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, బజార్ హత్నూర్ మాజీ మండల అధ్యక్షులు జల్కె పాండురంగ్, గిర్నూర్ సర్పంచ్ దినేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందు, గుడిహత్నూర్ మాజీ అధ్యక్షులు అంకత్ రవి, జిల్లా మీడియా కమ్యూనికేషన్ జితేందర్, బోరజ్ ఎస్సీ డిపార్ట్ మెంట్ అధ్యక్షులు పొట్ట అశోక్, గుడిహత్నూర్ ఉపాధ్యక్షులు మొయితే మారుతీ, గుడిహత్నూర్ స్పాక్స్ పర్సన్ ఆడే జైపాల్, పోలె విష్ణు, సూర్యవంశీ పాండురంగ్, గంగాధర్, ఉత్తమ్, జగన్, సందీప్, గణేష్, దేవన్న, బాబా రావు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తా : నరేష్ జాదవ్



- 2 కి.మీ బీటీ రోడ్డు మంజూరు చేయాలని డీసీసీ అధ్యక్షుడిని కలిసిన గ్రామస్తులు

(ఆదిలాబాద్, సాక్షర): గ్రామస్తులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ హామీ ఇచ్చారు. బట్టి సావర్గావ్ గ్రామస్తులు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఐటీ టవర్ కు అనుసంధానంగా బట్టి సావర్గావ్ గ్రామం నుంచి దుబ్బగూడ మోడల్ కాలనీ మీదుగా వెళ్లే మట్టి రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ బట్టి సావర్గావ్ గ్రామస్తులు డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బట్టి సావర్గావ్ గ్రామం నుంచి దుబ్బగూడ మోడల్ కాలనీ మీదుగా ఐటీ టవర్ కు వెళ్లే రహదారి ప్రస్తుతం మట్టి రహదారిగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వివరించారు.ఐటీ టవర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ మార్గంలో రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరుతూ డా. నరేష్ జాదవ్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ స్పందిస్తూ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బట్టి సావర్గావ్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డితో పాటు నల్ల గణపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, తడిసిన వెంకట్ రెడ్డి, లోగిటి శ్రీనివాస్, కోరటి ప్రభాకర్, అన్నం సెంటన్న, దొంతుల వెంకటేష్, దర్శనాల ప్రవీణ్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయాల్లో దళిత, బడుగు, బలహీన వర్గాల పాత్ర కీలకం : నరేష్ జాదవ్

- పార్లమెంటరీ ఎస్సీ విభాగం ఇన్ చార్జిగా దుర్గం శేఖర్ ను సన్మానించిన డీసీసీ అధ్యక్షులు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): కాంగ్రెస్ పార్టీ విజయాల్లో దళిత, బడుగు, బలహీన వర్గాల పాత్ర ఎంతో కీలకమని డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ ఎస్సీ విభాగం ఇన్ చార్జిగా నియమితులైన దుర్గం శేఖర్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ ను నూతనంగా ఆదిలాబాద్ పార్లమెంటరీ ఎస్సీ విభాగం ఇన్ చార్జిగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ దళితులకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తూ రాజకీయంగా, సామాజికంగా వారి అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు.దుర్గం శేఖర్ కు పార్లమెంటరీ ఎస్సీ విభాగం ఇన్ చార్జిగా బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని, ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజలతో ఉన్న అనుబంధం పార్టీ బలోపేతానికి ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ తదితర స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎస్సీ విభాగాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తా : దుర్గం శేఖర్ ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన దుర్గం శేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆదిలాబాద్ పార్లమెంటరీ ఎస్సీ విభాగం ఇన్ చార్జిగా బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, టీపీసీసీ నాయకత్వానికి, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ కు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎస్సీ వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గ్రామస్థాయి నుంచి పార్లమెంటరీ స్థాయి వరకు ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.దుర్గం శేఖర్ కు నూతన బాధ్యతలు దక్కడం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ ఇన్ చార్జ్ గౌలి సంజీవ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఫ్రంట్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డేరా కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్, జాదవ్ రాదేశ్యం, ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి దేవిదాస్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, సోనియా మంధని, అదవాలి రేఖ, గంగన్న, పొట్ట అశోక్, పట్టణ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు చంద్రాల రాహుల్, జిల్లా ఎస్సీ విభాగం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తిలో మాయిశ్చర్ ను పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

- జై గురు, రజిత జిన్నింగ్ మిల్లుల్లో పర్యటన



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జై గురు జిన్నింగ్ మిల్, రజిత జిన్నింగ్ మిల్లులలో పత్తిలో మాయిశ్చర్ ను ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. డీఎంఓ గజానంద్, మార్కెటింగ్ ఏడీ విట్టల్, ఐకేపీ సిబ్బందితో కలిసి మిల్లుల్లో పర్యటించి పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ పర్యటనలో మిల్లుల నిర్వహణ, పత్తి నిల్వ, మాయిశ్చర్ పరిశీలన తదితర అంశాలపై చర్చించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు... అవసరమైతే సస్పెండ్ చేస్తాం

- 49 వార్డుల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డులకు సంబంధించిన సానిటేషన్ జవాన్లు, సానిటేషన్ డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు, సానిటేషన్ ఎస్ఐ , ఇన్‌చార్జీలతో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ పూర్తి బాధ్యత సానిటేషన్ వర్కర్లు, డ్రైవర్లు, జవాన్లపై ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి కాలనీలో చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆదేశించారు. ఈ పనులపై నిరంతర పర్యవేక్షణ బాధ్యతను సానిటేషన్ ఎస్ఐ, ఇన్‌చార్జి నారాయణరెడ్డి పర్యవేక్షించాలని సూచించారు.పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం 49 వార్డులకు సంబంధించి 46 చిన్న చెత్త సేకరణ వాహనాలు, 21 ట్రాక్టర్లు, 3 జేసీబీలు, ఒక ల్యాడర్ తదితర వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇన్ని వాహనాలు ఉన్నప్పటికీ అప్పుడప్పుడు కొన్ని వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, అలాంటి సమయంలో పక్క వార్డుల వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైతే అందుబాటులో ఉన్న ఇతర వాహనాల ద్వారా సంబంధిత కాలనీలోని చెత్తను పూర్తిగా తొలగించాలని డ్రైవర్లు, జవాన్లకు స్పష్టం చేశారు.నిన్న మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త పేరుకుపోయిన ఘటనను తీవ్రంగా పరిగణించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, సానిటేషన్ ఎస్ఐకి షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు సంబంధిత జవాన్‌ను సస్పెండ్ చేయడం, ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు చిన్న వాహన డ్రైవర్లను విధుల నుంచి తొలగించడం జరిగిందని పేర్కొన్నారు.ఇకపై ప్రతి వార్డులో సానిటేషన్ ఎస్ఐ , ఇన్‌చార్జీలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనులను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. తాను కూడా వివిధ కాలనీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై సస్పెన్షన్‌తో పాటు, విధుల నుంచి తొలగించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా కొంతమంది డ్రైవర్లు ఒకటి లేదా రెండు ట్రిప్పులు మాత్రమే చెత్త సేకరించి 11 , 12 గంటలకే వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్తున్నారని, కాలనీలో చెత్త ఉన్నా కూడా తొందరగా డంపింగ్ యార్డుకు వెళ్లి వాహనాలను పార్కింగ్ చేసి విధులు ముగిస్తున్నారనే విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇకపై అలాంటి విధానాలకు స్వస్తి పలకాలని సూచించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని, ప్రతి కాలనీలో అవసరాన్ని బట్టి రెండు, మూడు లేదా నాలుగు ట్రిప్పులు వేసి చెత్తను పూర్తిస్థాయిలో సేకరించాలని ఆదేశించారు.ఒక కాలనీలో చెత్త సేకరణ పూర్తయ్యే వరకు సంబంధిత డ్రైవర్, సానిటేషన్ జవాన్ పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వాహనాల్లో ఏవైనా మరమ్మతులు లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ఇంజనీరింగ్ విభాగం అధికారులు వెంటనే స్పందించి వాటిని సరిచేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మరికొన్ని కొత్త వాహనాలు కూడా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.అదిలాబాద్ మున్సిపాలిటీలో ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఇలాంటి ఘటనలు పునరావతాలు అయితే సహించేది లేదని అవసరమైతే సస్పెండ్ చేస్తాం , విధుల నుండి కూడా తొలగిస్తామని హెచ్చరించడం జరిగింది.ప్రజలు కూడా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని ఎక్కడపడితే అక్కడ ఉదయం లేచి చెత్త వేయకూడదని , చెత్త వాహనం వచ్చేవరకు కొద్దిగా వెయిట్ చేయాలని అదేవిధంగా గౌరవ సభ్యులు కానీ , అందరూ చెత్త వాహనాలను మరియు డ్రైవర్లను కొద్దిగా పర్యవేక్షిస్తూ ఉండాలని చైర్‌పర్సన్ తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఎస్ఐ శంకర్ , నారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, టీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎనగంటి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, జిషాన్, అర్బాజ్, పర్వేజ్, మహిబూబ్, నాగసేన్, కిషోర్ సలీం , బబ్లు టిఆర్ఎస్ , ఎంఐఎం , కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సానిటేషన్ ఇన్‌చార్జీలు , డీఈఈ సందీప్, వివిధ వార్డుల సానిటేషన్ జవాన్లు, డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో క్విజ్, వ్యాసరచన పోటీలు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోన్ మండల పరిధిలోని సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బానాల నరేందర్ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను గుర్తించి,ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమారెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, బానాల నరేందర్, ముర్తుజాఖాన్, విశ్వనాథ్, బద్దం సాయిరెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి : అదనపు కలెక్టర్



(చెన్నూర్, సాక్షర): గ్రామంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా వేసవి దృష్ట్యా నీటి సమస్యలు తలెత్తకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఆదేశించారు. చెన్నూరు మండలం లంబడిపల్లి గ్రామపంచాయతీలో శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న గ్రామపంచాయతీ భవనం, వీఓ భవనాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో వీబీ గ్రామగ్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, బోర్వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.తదుపరి గ్రామంలోని ప్లాస్టిక్ నిర్వహణ యూనిట్ ను పరిశీలించి దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు.రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో కరువు పరిస్థితి ఏర్పడకుండా ముందస్తుగా చేపట్టాల్సిన నిర్వహణ పనులపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎంపీడీఓ భాస్కర్, లంబడిపల్లి సర్పంచ్ మహేష్ గహలోత్, ఉపాధి హామీ ఎంపీఓ, ఉపాధి హామీ ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జయంత్ అండ్ ది జింగో పెన్' ప్రతి విద్యార్థి చూడాల్సిన చిత్రం - ఎమ్మెల్సీ మల్క కొమరయ్య




నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ లో దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌లో టీం బిజీగా ఉంది. ఈ చిత్రంలోని లిరికల్ వీడియో సాంగ్‌ను డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల అధినేత మల్క కొమరయ్య విడుదల చేశారు. డీపీఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఇంటరాక్షన్ కార్యక్రమానికి ఆయన ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..* 'పిల్లల మనస్తత్వం, చదువుపై ఒత్తిడి, ముఖ్యంగా గణితం వంటి సబ్జెక్టుల పట్ల ఉండే భయాలను అధిగమించే మంచి సందేశంతో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రతి విద్యార్థి చూడాలి. మార్కులే పిల్లల ప్రతిభకు కొలమానం కాదు. ప్రతి చిన్నారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే' అని పేర్కొన్నారు. డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఈ చిత్రాన్ని చూపించేలా కృషి చేస్తానని మరోసారి హామీ ఇచ్చి చిత్ర బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సరిత మేడమ్, వైస్ ప్రిన్సిపల్, చిత్ర దర్శకుడు నవీన్ దేశబోయిన, కథానాయకుడు ఆశిష్ గాంధీ, బాలనటులు మాస్టర్ జయంత్ బొలిశెట్టి, ఊహా, ఇతర నటీనటులు, చిత్ర బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో చిత్ర బృందం నిర్వహించిన సరదా సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే బాలనటి ఊహా పుట్టినరోజు వేడుకలను విద్యార్థులు, చిత్ర బృందం సమక్షంలో ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. నవంబర్ 14 నుంచి థియేటర్లలో 'జయంత్ అండ్ ది జింగో పెన్' సందడి చేయనుంది. నటీనటులు* : మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి,

'టైసన్ నాయుడు' సినిమా నుంచి 'మదరాసి రబ్బరు బొమ్మ' రిలీజ్



ప్రామిసింగ్ స్టార్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, హరీష్ కట్టా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో సాయి శ్రీనివాస్ మునుపెన్నడూ చూడని మాస్ మేకోవర్‌తో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన సినిమా టైటిల్, గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ఎనర్జిటిక్‌గా ప్రారంభిస్తూ మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'మదరాసి రబ్బరు బొమ్మ'ను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాట ఇన్ఫెక్షియస్ రిథమ్స్, ఎలక్ట్రిఫైయింగ్ బీట్స్, ఇన్‌స్టంట్ మాస్ అప్పీల్‌తో ఆకట్టుకునే ఫోక్ నంబర్‌గా నిలిచింది. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఫోక్ కంపోజిషన్స్, మాస్ నంబర్స్ అందించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భీమ్స్ సిసిరోలియో.. ఆకట్టుకునేలా ఈ ఫోక్ బ్యాంగర్‌ను రూపొందించారు. డైనమిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఉర్రూతలూగించే మ్యూజిక్ అరేంజ్‌మెంట్స్, హై ఎనర్జీ కంపోజిషన్ ఈ పాటకు అదిరిపోయే సెలబ్రేషన్ వైబ్‌ను తీసుకొచ్చాయి. సురేష్ గంగుల అందించిన లిరిక్స్ పాటకు ఎంటర్‌టైనింగ్ మాస్ ఫ్లేవర్‌ను జోడించాయి. హీరో, హీరోయిన్ మధ్య సరదాగా సాగే రొమాంటిక్ సంభాషణలను తన పదాలతో అందంగా ఆవిష్కరించారు. హీరో తన ప్రేమను 'మదరాసి రబ్బరు బొమ్మ' అంటూ ముద్దుగా పిలుస్తూ ఆమెను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాడు. అందుకు అమ్మాయి కూడా అంతే చమత్కారంగా సమాధానమిస్తూ వారి మధ్య మ్యూజికల్ బాంటర్‌ను మరింత సరదాగా మార్చింది. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సొరట్ తమ పవర్‌ఫుల్ వాయిస్‌తో పాటకు అద్భుతమైన ఎనర్జీని అందించారు. పాట విజువల్స్ కూడా ఎంతో కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి ఆకట్టుకునే ఫోక్ ఇన్‌స్పైర్డ్ కాస్ట్యూమ్స్‌లో కనిపించారు. సాయి శ్రీనివాస్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకోగా, నేహా శెట్టి కూడా ఆకట్టుకునే స్టెప్పులేశారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ, లైవ్లీ స్క్రీన్ ప్రెజెన్స్ ఈ పాటను మంచి విజువల్ ట్రీట్‌గా మార్చాయి. విజయ్ పోలాకి అందించిన కొరియోగ్రఫీ ప్రత్యేకంగా ఉంది. ఎనర్జిటిక్ మూవ్‌మెంట్స్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్‌తో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్, వైబ్రెంట్ సెట్స్ పాటలోని పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. క్యాచీ ఫోక్ ఫ్లేవర్, దుమ్మురేపే వోకల్స్, ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ ప్రెజెంటేషన్‌తో 'మదరాసి రబ్బరు బొమ్మ' ఆల్బమ్ నుంచి వచ్చిన తొలి పాటగా ఆకట్టుకుంది. సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు మంచి ఊపునిచ్చింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ముకేష్ జ్ఞానేష్, మ్యూజిక్ డైరెక్టర్‌గా భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్‌గా కోటగిరి వెంకటేశ్వరరావు, ఆర్ట్ డైరెక్టర్స్‌గా అవినాష్ కొల్లా, కిరణ్ కుమార్ పనిచేస్తున్నారు. స్టంట్ శివ, విజయ్, వెంకట్, రియల్ సతీష్ యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు. -నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి

సండియార్' మూవీ టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ప్రస్తుతం ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ లెంగ్త్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్ఐ), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో కమల్ హాసన్ గతంలో ఎన్నడూ చూడని రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి పవర్‌ఫుల్‌గా 'సండియార్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కమల్ హాసన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో, గ్రే గడ్డంతో, చిన్నగా కత్తిరించిన హెయిర్‌స్టైల్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. డార్క్ బ్రౌన్ షర్ట్ ధరించిన ఆయన ఓ వాహనం కిటికీకి ఆనుకుని, నేరుగా ముందుకు చూస్తూ ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో కనిపిస్తునారు. ఆ వాహనంపై కనిపిస్తున్న రక్తపు మరకలు పోస్టర్‌కు రా అండ్ గ్రిట్టీ ఫీల్ తీసుకొచ్చాయి. వైలెన్స్ మధ్య సాగే ఓ బలమైన పాత్రలో కమల్ హాసన్ కనిపించబోతున్నారనే ఆసక్తిని ఈ పోస్టర్ కలిగిస్తోంది. 'సండియార్' అనే టైటిల్ వినగానే భయంలేని, ధైర్యవంతమైన, శక్తిమంతమైన వ్యక్తి గుర్తుకొస్తాడు. కమల్ హాసన్ పోషిస్తున్న పాత్రకు ఈ టైటిల్ పర్ఫెక్ట్. ఆయన ఇంటెన్స్ లుక్, ప్రశాంతంగా కనిపిస్తూనే భయపెట్టే బాడీ లాంగ్వేజ్.. రాజీ పడని మనస్తత్వం, బలమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రను సూచిస్తున్నాయి. ఈ ఫస్ట్ లుక్‌తోనే సినిమాలోని పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చారు. దీంతో యాక్షన్‌తో నిండిన ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. 'సేతుపతి', 'చిత్తా' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సునీల్ కె.ఎస్. సినిమాటోగ్రాఫర్‌గా, అన్బరివ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా, అమృతా రామ్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. సి.ఎస్. బాలచందర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, ఎస్. డిస్నీ కో-ప్రొడ్యూసర్‌గా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు, కమల్ హాసన్ పవర్‌ఫుల్, ఫియర్స్ అవతార్‌లో కనిపించడంతో 'సండియార్' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. -నటీనటులు: కమల్ హాసన్

వృషకర్మ' సినిమా నుంచి 'స్వాగ్ ఆఫ్ అర్జున్' రిలీజ్



యువ సామ్రాట్ నాగచైతన్య ప్రతిష్టాత్మక మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ, ప్రతి సినిమాతో తెరపై కొత్తదనాన్ని చూపించే నాగ చైతన్య.. 'స్వాగ్ ఆఫ్ అర్జున్' ఫస్ట్ సింగిల్‌తో తన స్క్రీన్ ప్రెజెన్స్‌లో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. స్టైల్, అటిట్యూడ్, ఎనర్జీ కలగలిసిన ఈ పాటలో అర్జున్ పాత్రను పరిచయం చేశారు. అసాధారణమైన సాహస యాత్రకు సిద్ధమవుతున్న ట్రెజర్ హంటర్‌గా అర్జున్‌ను ఈ పాటలో చూపించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ ట్రెండీ బీట్స్‌తో అదిరిపోయే కంపోజిషన్ అందించడమే కాకుండా, తన ప్రత్యేకమైన వాయిస్ తో పాటను మరింత ఆకట్టుకునేలా పాడారు. లిరిసిస్ట్ అభినవకవి తన సాహిత్యంతో కథానాయకుడి స్వాగ్, అటిట్యూడ్‌ను అద్భుతంగా ఆవిష్కరించారు. ఇక 'ఐయామ్ బార్న్ టు రూల్' అనే పవర్‌ఫుల్ క్యాచ్‌లైన్ అర్జున్ పాత్రకు మంచి ఎలివేషన్ ఇచ్చింది. తన సాహస యాత్రకు అర్జున్ ఎలా సిద్ధమవుతున్నాడో ఈ పాట ద్వారా ఆసక్తికరంగా చూపించారు. స్టైలిష్, కాన్ఫిడెంట్ అవతార్‌లో నాగ చైతన్య ఆకట్టుకున్నారు. ఆయన ఎలిగెంట్ బాడీ లాంగ్వేజ్, కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రకు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ, చైతన్య ఈజీగా చేసిన డ్యాన్స్ మూవ్స్, స్టైలిష్ స్టెప్స్ ఈ పాటను విజువల్ ట్రీట్‌గా నిలిపాయి. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, స్పర్శ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రఘుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, నవీన్ నూలి ఎడిటింగ్ ఈ ఎనర్జిటిక్ ట్రాక్ ద్వారా అర్జున్ ప్రపంచాన్ని మేకర్స్ ప్రేక్షకులకు పరిచయం చేశారు. రహస్యాలు, సాహసాలు, ఉత్కంఠతో సాగనున్న అర్జున్ ప్రయాణంపై ఈ పాట మరింత ఆసక్తిని పెంచుతోంది. ఫస్ట్ సింగిల్‌తో సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు బ్లాక్‌బస్టర్ ఆరంభం లభించింది. రాబోయే ప్రమోషనల్ కంటెంట్‌పై కూడా అంచనాలు మరింత పెరిగాయి. -నటీనటులు: నాగ చైతన్య, మీనాక్షి చౌదరి, స్పర్శ శ్రీవాస్తవ

కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా 'సండియర్' షూటింగ్ ప్రారంభం



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్రబృందం ప్రత్యేక కానుక అందించింది. ప్రముఖ దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్, కమల్ హాసన్ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్ ఈరోజు అధికారికంగా ప్రారంభమైంది. కమల్ హాసన్ పుట్టినరోజునే సినిమా ప్రొడక్షన్ ప్రారంభం కావడంతో చిత్రబృందానికి ఇది ప్రత్యేకమైన సందర్భంగా నిలిచింది. కమల్ హాసన్ పుట్టినరోజుకు ఒక రోజు ముందుగా, నవంబర్ 6న మేకర్స్ ఈ చిత్రానికి 'సండియర్' అనే టైటిల్‌ను ప్రకటించారు. టైటిల్ ప్రకటనతో అభిమానులు, సినీ ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలు, ఆసక్తి నెలకొన్నాయి. కమల్ హాసన్ లుక్ టెస్ట్‌కు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేయగా, తాజాగా నవంబర్ 7న కెమెరాలు ఆన్ కావడంతో సినిమా మరో కీలక దశలోకి అడుగుపెట్టింది. విభిన్నమైన కథాంశాలు, ఆకట్టుకునే కథనంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్.. తన అద్భుతమైన నటన, ప్రతి తరంలోనూ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే విలక్షణతతో ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్న కమల్ హాసన్‌తో చేతులు కలిపారు. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. 'సండియర్' చిత్రానికి ప్రతిభావంతమైన సాంకేతిక బృందం పనిచేస్తోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు, ప్రముఖ యాక్షన్ డైరెక్టర్స్ అన్బరివ్ యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు. కె.ఎస్. సునీల్ సినిమాటోగ్రాఫర్‌గా, సి.ఎస్. బాలచందర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమృతా రామ్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. 'సండియర్' చిత్రాన్ని రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్ఐ), టర్మరిక్ మీడియా బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నవంబర్ 6న టైటిల్ ప్రకటన, నవంబర్ 7న షూటింగ్ ప్రారంభంతో 'సండియర్' చిత్రం కమల్ హాసన్ పుట్టినరోజును మరింత ప్రత్యేకంగా మార్చింది. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా ప్రయాణానికి అద్భుతమైన ఆరంభం లభించింది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.

అలియాస్ రుక్మిణి' సినిమా నుంచి హీరో నితిన్ లుక్ రిలీజ్



బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మాణంలో రొమాన్స్, హ్యూమర్, ఆసక్తికరమైన కథనంతో ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ విడుదల చేసిన కొత్త ప్రమోషనల్ వీడియోలో నితిన్‌ను కృష్ణగా సరికొత్త అవతార్‌లో పరిచయం చేశారు. రుక్మిణి తన ప్రపంచంలోకి రాకముందు కృష్ణ జీవితం ఎలా ఉండేది? అనే ఆసక్తికరమైన అంశాన్ని ఈ వీడియో ద్వారా చూపించారు. యంగ్ కృష్ణను, అతడి కలలను, ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని పరిచయం చేశారు. దర్శకుడు మురళీ కాంత్ దేవసోత్, రుక్మిణి పాత్రలో నటిస్తున్న ఆఫియా సయ్యద్‌తో యువకుడైన కృష్ణ గురించి మాట్లాడుతున్న సన్నివేశంతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. ఆ సంభాషణలోకి నితిన్ యంగ్ అండ్ చార్మింగ్ లుక్‌లో ఎంట్రీ ఆకట్టుకుంది. ఈ లుక్‌లో నితిన్ దాదాపు పదేళ్లు చిన్నవాడిగా కనిపిస్తున్నారు. పాత్ర వయసుకు తగ్గ అమాయకత్వం, స్వేచ్ఛగా ఉండే స్వభావాన్ని ఆయన లుక్ చక్కగా కనిపిస్తోంది. కృష్ణ పాత్రలో నితిన్ చేసిన ఈ సరికొత్త మేకోవర్ ఆయన నటనకు మరో కొత్త కోణాన్ని తీసుకొచ్చింది. నితిన్‌ను ఇంత యంగ్ లుక్‌లో చూసి ఆఫియా సయ్యద్ కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఫ్రెష్ లుక్, సన్నని మీసంతో నితిన్ ఈ పోస్టర్‌లో యంగ్ కృష్ణగా ఆకట్టుకుంటున్నారు. మస్టర్డ్ ఎల్లో క్యాజువల్ టీషర్ట్ ధరించి, డెస్క్ దగ్గర కూర్చుని చేతిలో పెన్ను పట్టుకుని ఏదో ఆలోచనల్లో మునిగిపోయినట్లు కనిపిస్తున్నారు. ఆయన అమాయకమైన ఎక్స్‌ప్రెషన్స్, సింపుల్ స్టైలింగ్, సహజమైన బాడీ లాంగ్వేజ్ పాత్రకు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. నితిన్, ఆఫియా సయ్యద్ జోడీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలవనుంది. వీరిద్దరి పాత్రలు కథకు ప్రత్యేకమైన రొమాంటిక్ ఫ్లేవర్‌ను అందించనున్నాయి.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com